RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 115 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం,అక్టోబర్,25,2025 | పేజీలు : 8  వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 115 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday,October,25,2025 | PAGES : 8  RS : 4 /- |



జంగిల్ రాజ్‌పై వందేళ్లయినా

## చర్చిస్తారు

### ఆర్జెడి గత పాలనపై మోడీ ఘాటు వ్యాఖ్యలు

పాట్నా, : బిహార్‌లో ఆర్జేడీ 'జంగల్ రాజ్' పై మరో వందేళ్లయినా చర్చ జరుగుతూనే ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు తమ దురాగతాలను దాచిపెట్టేందుకు ఎంత ప్రయత్నించినా.. ప్రజలు క్షమించరన్నారు. ప్రతిపక్షాలది 'మహాగఠ్‌బంధన్' కాదని..'లఠ్‌బంధన్ అంటే నేరస్థుల కూటమి అని విమర్శించారు. ఆ పార్టీల నేతలంతా బెయిల్‌పై బయట తిరుగుతున్నవారేనని పేర్కొన్నారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ యువ సంవాద్' ఆడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు.






కర్నూలు శివారులో

## ఘోర బస్సు ప్రమాదం

- మంటల్లో కాలి బూడిదయిన బస్సు
- ప్రమాదంలో 19 నిండు ప్రాణాలు బుగ్గి
- బైకును ఢీకొని తగులబడ్డ బస్సు
- ప్రమాదం గుర్తించని డ్రైవర్లు
- బతికిబయటపడ్డ 22మంది
- పలువురికి గాయాలు..ఆస్పత్రిలో చికిత్స



కర్నూలు,తెలంగాణ దిశ : మాటకందని విషాదం.. తెల్లవారు జామున ఏంజరిగిందో తెలుసుకునే లోపే 19 నిండుప్రాణాలు బుగ్గిగా మారాయి. నిద్రలోనే ప్రాణాలు హరీమన్నాయి. మంటల్లో బస్సు తగలుబడుతోందన్న విషయం తెలిసే లోపు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయి. ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరెందరో ఆశలను బుగ్గి చేసింది. కర్నూలు జిల్లాలో జరగిన ట్రావెల్ బస్సు దుర్ఘటన కనీవినీ ఎరుగని విషాదాన్ని నింపింది. బస్సుకు మంటలు అంటుకుని బూడిద య్యింది. బస్సులోనే ఈ 19మంది సజీవ దహనం అయ్యారు. తాము ఎక్కిన బస్సే శ్మశానవాటికి అవుతుందని...అందులో తాము సజీవ దహనం అవుతామని ఊహించని ఘటన ఇది.



ప్రపంచం క్లిష్ట పరిస్థితులను

## ఎదుర్కొంటోంది

**- ఐక్యరాజ్య సమితి పనితీరు అందుకు తగ్గట్లుగా లేదు**
**- భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్**

న్యూఢిల్లీ, :ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్తుందని భారత విదేశాంగ మంత్రిఎస్‌జైశంకర్ అన్నారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించలేవని వ్యాఖ్యానించారు. ఈక్రమంలో యూఎన్‌లో అంతా సరిగా లేదన్నారు. ఐరాసలో అర్థవంత మైనసంస్కరణలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది అత్యవసరమైనప్పటికీ.. యూఎన్‌లో మార్పులు జరిగేలా ఆ సంస్కర ణలు ఉండాలన్నారు. ఐరాసకు భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని.. అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ.. యూఎన్ నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు.



ఎన్డీఏ అంటే

## వికాసం

### ఇండియా కూటమి వినాశనం బీహార్ ఎన్నికల ప్రచారంలో జెపి నడ్డా విసుర్లు

పాట్నా, :బిహార్ ఎన్నికలను ఎన్డీయే 'వికాసానికి', ఇండియా కూటమి 'వినాశనానికి' మధ్య జరుగుతున్న పోరుగా భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. భాగస్వామ్య పక్షాలను అంతం చేసే పరాన్నజీవి పార్టీగా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ.. రంగ్‌దారీ (దోపిడీ), జంగల్‌రాజ్ (ఆటవిక పాలన), దాదాగిరీ (దౌర్జన్యం)లకు ప్రతీక అని విమర్శించారు. బిహార్‌లోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు.

నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి

## రేవంత్ రెడ్డి

### ఏఐసీసీ కార్యాలయంలో కీలక సమావేశం

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఢిల్లీకి వెళ్లనున్నారు. రేపు మధ్యాహ్నం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఒక కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకాను న్నారు. తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో డీసీసీ అధ్యక్షుల ఎంపికను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ మేరకు తెలంగాణకు 22 మంది పరిశీలకులను నియమించి ంది. ఒత్తిళ్లకు తావులేకుండా నిర్ణయాలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఏఐసీసీ సీనియర్ నాయకులను ఇన్‌ఛార్జిలుగా నియమించింది. ఈ నెలాఖరు వరకు డీసీసీ అధ్యక్షులను నియమించనున్నారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆయా జిల్లాల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లనున్నారు. కాగా, ముఖ్యమంత్రి రెండు రోజుల పాటు ఢిల్లీలో ఉండనున్నారు.





మారిన తెలంగాణ ఇంటర్ పరీక్షల

## షెడ్యూల్

### ఫిబ్రవరి చివరిలోనే నిర్వహణ

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఏటా మార్చిలో జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలను ఈ విద్యా సంవత్సరం కాస్త ముందుగానే నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు, ముఖ్యంగా సెకండియర్ చదువుతున్న వారికి ఎంసెట్, ఐఐటీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు తగినంత సమయం ఇచ్చే లక్ష్యంతో ఈ మార్పు చేశారు. ఇంటర్ బోర్డు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం గురువారం ఆమోదముద్ర వేసింది. సాధారణంగా ప్రతి ఏటా మార్చి మొదటి వారంలో ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలు ఈసారి ఫిబ్రవరి చివరి వారంలోనే మొదలుకానున్నాయి. విడుదలైన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 25నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం, ఫిబ్రవరి 26 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి.




**నిజామాబాద్,తెలంగాణ దిశ:** కల్తీ కల్లు కాటేస్తుంది. కల్తీ కల్లు కుప్రాణాలు హరి మంటున్నాయి. కామారెడ్డి జిల్లాలో పలు సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలం తాండూ రు గ్రామంలో కల్తీ కల్లు కు బానిసగా మారి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. కల్తీ కల్లు తాగుదామని వెళ్తే కాటికి పంపేశారు..కల్తీ కల్లు లో ఏమేం కలుపుతున్నారో తెలుసా..! కల్తీ కల్లు ప్రాణాలు తీస్తుందని తెలిసినా.. చాలా మంది దానికి అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తక్కువ ధరకే దొరుకుతుండటంతో కల్లు కాంపౌండ్లలోకి వెళ్లి ఆ కల్తీ కల్లు, రసాయనాలు కలిపిన కల్లు తాగి ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారు. కల్తీ కల్లు తాగి ప్రాణాలు కోల్పోతున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు.సహజంగా చెట్ల నుంచి వచ్చే కల్లులో రసాయనాలు, నీళ్లు, ఇతర పదార్థాలు కలిపి భారీ మొత్తం లో తయారు చేసి కల్లు కాంపౌండ్లలో విక్రయిస్తున్నారు.

## కాటేస్తున్న కల్తీ కల్లు

## సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పిన మంత్రి కొండా సురేఖ..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ-సీఎం రేవంత్ రెడ్డి వివాదం సర్దుమనిగిం ది. మంత్రి కొండా సురేఖ స్వయంగా మీడియా ముందుకు వచ్చి సీఎంకి క్షమాప ణలు చెబుతూ వివాదానికి తెరదించారు. తమ ఇంటికి పోలీసులు రావడంతో సుస్మిత ఆవేశంతో కొన్ని వ్యాఖ్యలు చేసిందని.. ఆమె తరపున తాను క్షమాపణ చెబుతున్నానన్నారు. ప్రస్తుతం తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని త్వరలోనే అన్నీ సవ్యంగా సర్దుకుంటాయని స్పష్టం చేశారు. దీంతోసీఎం రేవంత్ వర్గీయులు సైతం కూల్ అయినట్టు భావిస్తున్నారు. కాగా కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ బంజా రాహిల్స్‌లోని మంత్రి కొండా సురేఖ నివాసానికి పోలీసులు చేరుకోవడం





పెద్ద వివాదానికి దారితీసింది. ఆమెకు ఓఎస్‌డీగా పనిచేసిన సుమంత్ అనే అధికారి అవినీతి ఆరోపణలతో అరెస్టు చేయడానికి పోలీసులు వెళ్లారు. అయితే ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా పోలీసులు ఇంటికి రావడంతో.. సురేఖ కుమార్తె కొండా సుస్మిత వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేయడం కలకలానికి దారితీసింది. సుస్మిత మాట్లాడుతూ.. మాఇంటికి రోహిణ్ రెడ్డి గన్ తో వచ్చారని.. అది ఇచ్చింది సీఎం రేవంత్ అంటూ వ్యాఖ్యానించారు. ఉద్దేశపూర్వకంగా బీసీ మహిళా మంత్రిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో కాంగ్రెస్‌లో వర్గపోరు మళ్లీ తలెత్తిందని చర్చ మొదలైంది. వివాదం తీవ్రరూపం దాల్చడంతో కాంగ్రెస్ హైకమాండ్ సైతం జోక్యం చేసుకుంది.

# యాదవుల సదర్ మన రాష్ట్రానికే ఖదర్ : కూన శ్రీశైలం గౌడ్




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 24, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 127 రంగారెడ్డి నగర్ డివిజన్ కురుమ యాదవ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ సదర్ సమ్మేళనంలో పాల్గొని దున్నరాజుల ప్రదర్శనను వీక్షించారు. అనంతరం సదర్ సమ్మేళన ఉత్సవ కమిటీ సభ్యులు వారి ఆచార సంప్రదాయాలతో మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కుల వృత్తులా కుటీర పరిశ్రమ అని కొనియాడారు. యాదవ సోదరులు దున్న రాజులను పూజించి పాడి పశు సంపదను సంరక్షించుకుని ప్రతి సంవత్సరం సదర్ సమ్మేళనం జరపడం చాలా సంతోషంగా ఉందన్నారు. నా బాల్యం, నా జీవన విధంగా అన్ని కులాలతో ముడి పడిఉందని సదర్ సమ్మేళనంలో గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగం యాదవ్, బాలరాజ్, మోటే శ్రీనివాస్ యాదవ్, నవీన్ కురుమ, శ్రీకాంత్ యాదవ్, సాయి, అశోక్, కిరణ్ యాదవ్, అంజప్ప, రవి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాగారంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే ప్రాంతాలు

(నాగారం, తెలంగాణ దిశ)చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని నాగారం అసిస్టెంట్ ఇంజనీర్ ఎ. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా11 కెవి సింహపురి కాలనీ ఫీడర్ 33/11 కెవి చక్రిపురం సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీ నగర్, సింహపురి కాలనీ, పాత గ్రామం, వికాస్ నగర్, వెంకటేశ్వర నగర్ కాలనీ, మధురా నగర్, దుర్గయ్య నగర్, దత్తాత్రేయ కాలనీ మరియు తారాపురి కాలనీ కాలనీలలో నుండి 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందిని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.




# మురుగుతో రోడ్డుపై దుర్గంధం,దుర్వాసన

కుషాయిగూడ పాత విక్రాంత్ వైన్స్ వెనకాల వీధిలో రోడ్డుపై మురుగు పేరుకుపోవడంతో దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతుంది. ఈ వీధి గుండా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు జలమండలి, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ లాభం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని మురుగు నుంచి విముక్తి కల్పించాలని స్థానికులు కోరారు.

(కుషాయిగూడ, తెలంగాణ దిశ)



# క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహించాలి : ఎమ్మెల్యే వివేకానంద్




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 24, (తెలంగాణ దిశ):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బోరబండ డివిజన్ లోని బిఆర్ఎస్ క్లస్టర్ ఇంచార్జ్, బూత్ ఇంచార్జ్ లతో నిర్వహించిన సమావేశానికి బోరబండ డివిజన్ ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలు హాజరై ఎన్నికల ప్రచార తీరును పరిశీలించి, గెలుపే లక్ష్యంగా చేపట్టవలసిన ప్రచార తీరును బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త వారికి కేటాయించిన ప్రాంతాలలోని ఓటరును క్షేత్రస్థాయిలో కలిసి గత పదకొండేళ్లలో మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు హామీలను, మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులకు బాకీ కార్డును చూపించి హామీల అమలుపై నిలదీసేలా ప్రతీ ఇంటికి బాకీ కార్డులు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు క్రిష్ణ మోహన్, క్లస్టర్ ఇంచార్జ్ లు, బూత్ ఇంచార్జ్ లు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాసిన్ చెరువు కట్టపై సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



దమ్మాయిగూడ నాసిన్ చెరువు కట్టపై రూ. 40 లక్షల మున్సిపల్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ వెంకట్ రెడ్డి గురువారం ప్రారంభించారు. దమ్మాయిగూడ చౌరస్తా నుంచి ఐకామ్ మీదుగా అహ్మద్ గూడ వెళ్లేందుకు దగ్గరవుతుంది. అదే విధంగా పలు కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – (దమ్మాయిగూడ, తెలంగాణ దిశ)

# బిఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ ను కలిసిన చింతల




తెలంగాణ దిశ: ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి జూబ్లీహిల్స్ లో జరిగే ఉప ఎన్నికల్లో పై పలు సూచనలు చేసారు. బిఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని అన్నారు.

## నేటి నుంచి డిసెంబర్ 2 వరకు అయ్యప్ప స్వాములకు ఉచిత అన్నప్రసాద వితరణ

**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 24, (తెలంగాణ దిశ) :** అయ్యప్ప స్వాములకు నేటి నుంచి డిసెంబర్ రెండవ తేదీ వరకు ఏఎస్ రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డ మారుతీనగర్ లోని శ్రీ సాయిబాబా మందిరంలో ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు శ్రుతికేష్ ఇండస్ట్రీస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు, జమ్మిగడ్డ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ తెలిపారు.



## కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక బస్సులు

**కుషాయిగూడ, అక్టోబర్ 24, తెలంగాణ దిశ) :** కార్తీక మాసం సందర్భంగా ఆర్టీసీ కుషాయిగూడ డిపో నుంచి అతి తక్కువ ధరలో పెళ్లిళ్లకు శుభకార్యాలకు పుణ్యక్షేత్రాల సందర్శనకు బస్సులు అద్దెకు ఇవ్వ బడునని డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ తెలిపారు. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంచారామాలు, శ్రీశైలం, వేములవాడ, అరుణాచలం, కొమురవెల్లి మల్లన్న తదితర పుణ్యక్షేత్రాలకు, భక్తులు కోరుకున్న యాత్రలకు బస్సులు ఇవ్వబడునని తెలిపారు. అలాగే కీసర గుట్టకు ఈసీఐఎల్ బస్టాండ్ నుండి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# టీడీపీ నేతల మధ్య సమన్వయం కరువు

**గుంటూరు,తెలంగాణ దిశ:** తెలుగుదేశం పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం సక్రమంగా పనిచేయడం లేదా? పార్టీ కార్యాలయం వల్లనే పార్టీ ఇన్ని రకాలుగా ఇబ్బందులు పడుతుందా? నేతల మధ్య సమన్వయం లేకపోవడానికి కూడా పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం అనుసరిస్తున్న మెతక వైఖరి అని చెబుతున్నారు. చంద్రబాబు నాయుడు చేతుల్లోకి తెలుగుదేశం పార్టీ వచ్చిన తర్వాత 1995 నుంచి ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ ఏంమాట్లాడాలన్నా అది ముందు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాల్సి ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ లో ఉన్న ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో మీడియా సమావేశం పెట్టాలన్నా, లేకపోతే అసెంబ్లీ సమావేశాల్లో ఏ విషయాలను అయినా ప్రస్తావించాలన్నా ముందుగా పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించాల్సి వచ్చేది. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో ఉండే... ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో ఉండే లైబ్రరీలో అన్ని అంశాలకు సంబంధించిన విషయాలు.. అసెంబ్లీ చట్టాలకు సంబంధించిన సమగ్ర సమాచారం లభ్యమయ్యేది. నాడు దేవేందర్ గౌడ్ నుంచి కింది స్థాయి నేత వరకూ లైబ్రరీకి వెళ్లే అలవాటు ఉండేది. వారు అసెంబ్లీ సమావేశాల్లోనో, మీడియా సమావేశాల్లోనూ మాట్లాడాలంటే లైబ్రరీకి వెళ్లి తాము మాట్లాడబోయే అంశానికి సంబంధించిన వాటిపై అధ్యయనం చేసేవారు. గతంలో ఉన్న విషయాలను కూడా వారు ఆకళింపు చేసుకునే వారు. అధికారంలో ఉన్నప్పుడైనా, లేకపోయినా సరే ఖచ్చితంగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చి అందుకు సంబంధించిన అంశాలను పరిశీలించేవారు. కానీ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆ సంప్రదాయానికి నేతలు నీళ్లొదిలేశారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి వారికి కేటాయించే సమయంలో మాత్రమే ఎమ్మెల్యేలు వస్తున్నారు. సబ్జెక్ట్ పై అవగాహన కోసం కానీ, తాము మాట్లాడలనుకున్న విషయాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలియపర్చేందుకు ఇష్టపడటం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం కూడా దీనిని పట్టించుకోవడం లేదు. సీనియర్ నేతలకు మాత్రమే ఈ విషయం తెలుసు. ఇప్పుడంతా కొత్త తరం నాయకులు కావడంతో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతోనే సమస్యలు వస్తున్నాయన్న అభిప్రాయం టీడీపీ సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది.

# వ్యూహాత్మకంగా మజ్లీస్ పార్టీ!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి అన్ని రాజకీ య పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. అయితే హైదరా బాద్ లో పట్టున్న ఎంఐఎం పార్టీ మాత్రం ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అసలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేస్తుందా? లేదా? అన్నది కూడా అనుమానంగానే ఉంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎంఐఎం కీలక భూమిక పోషించనుం ది. నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. గతంలోనూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేసింది. మిగిలిన పార్టీల కంటే అత్యధిక ఓట్లను ఎంఐఎం అభ్యర్థి సాధించింది. గతం లోనూ ఎంఐఎం తరుపున నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి అత్యధిక ఓట్లను సాధించారు. గెలవకపోయినా అత్యధిక ఓట్లను సాధించారు. గత ఎన్నికల్లో జూబ్లీ హిల్స్ నియోజకవర్గం నుంచి మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. ఆయన మాగంటి గోపీనాథ్ చేతిలో ఓటమి పాలయ్యా రు. అయితే ఈసారి మాత్రం అజారుద్దీన్ పేరు కాంగ్రెస్ పార్టీలో వినిపించడం లేదు. కేవలం మూడు పేర్లను మాత్రమే అధినాయకత్వా నికి పంపింది.



# సంపాదకీయం

## భారత్ వైపు చూస్తున్న ప్రొఫెషనల్స్

హెచ్1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ డోనల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం అక్కడ ఉంటున్న నిపుణులైన భారతీయుల్ని వెనక్కి తీసుకురావచ్చన్న ఆలోచనను ఇక్కడి పాలకుల్లో కల్పించింది. విదేశాల్లో ఉంటున్న భారతీయులు స్వదేశానికి వచ్చి దేశ నిర్మాణంలో భాగస్వాములు అయ్యేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సన్నిహితంగా ఉండే అధికారి ఒకరు చెప్పారు. హెచ్1బీ వీసాలు అమెరికాకు ఉపయోగపడతాయని, వాటి దరఖాస్తు ఫీజు పెంచడం వల్ల అంతర్జాతీయ ప్రతిభను భారతదేశంవైపు ఆకర్షించే అవకాశం ఏర్పడుతుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో సభ్యుడొకరు చెప్పారు. 30 ఏళ్లుగా టెక్నాలజీ, మెడికల్, ఇతర ఇన్నోవేటివ్ రంగాలలో భారత్ నుంచి వలస వెళ్లిన అత్యంత ప్రతిభావంతులైన నిపుణులను రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్ ద్వారా తిరిగి రప్పించాల్సిన సమయం ఆసన్నమైంది. అమెరికాతో పాటు ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో వలసదారులు, ముఖ్యంగా భారతీయులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలు ప్రవాసులను ఈ దిశగా ఆలోచించేలా చేస్తోందని చెప్పడానికి కొన్ని సంఘటనలు ఉన్నాయి. అయితే లక్షల మందిని బెల్లేవ్ నుంచి బెంగళూరు తీసుకు రావడం చెప్పినంత తేలిక్కాదని కొంతమంది నిపుణులు అన్నారు. అమెరికా తర్వాత.. యూరప్, ఆస్ట్రేలియాలోనూ భారతీయులకు నిరసనలు ఎందుకు ఎదురవుతున్నాయి? 20 ఏళ్ల కిందట అమెరికాలో స్థిరపడిన కొంతమంది భారతీయుల్లో నితిన్ హాసన్ ఒకరు. గతేడాది ఆయన బెంగళూరు రావాలని హఠాత్తుగా నిర్ణయం తీసుకున్నారు. అయితే అదంత తేలికైన నిర్ణయం కాదు. ఎందుకంటే, మెటాలో లక్షల రూపాయల జీతాన్ని వదులుకుని భారత్‌లో అనిశ్చితిలో ఉన్న స్టార్టప్‌ల రంగంలోకి వెళ్లాలని తీసుకున్న నిర్ణయమది. సొంతంగా ఏదో ఒకటి చేయాలని అనుకునేవాడిని. అయితే వలసదారుడిగా అమెరికాలో అందుకు నాకున్న స్వేచ్ఛ చాలా తక్కువ" అని ఆయన చెప్పారు. ఆయన భారత్ తిరిగొచ్చిన తర్వాత రెండు స్టార్టప్‌లు ప్రారంభించారు. ఇందులో అమెరికాలో స్థిరపడిన భారతీయులు "స్వదేశానికి తిరిగి రావడం వల్ల కలిగే భావోద్వేగ, ఆర్థిక, వృత్తిపరమైన సవాళ్లను అధిగమించడంలో సాయపడే బీ2ఐ (బ్యాక్2 ఇండియా) అనే ప్లాట్‌ఫామ్ కూడా ఉంది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక వలసదారులతో వ్యవహరిస్తున్న తీరు చూసి, అమెరికా వెళ్లాలని భావిస్తున్న అనేకమంది తమకు ఫోన్ చేస్తున్నారని, హెచ్1బీ గొడవల వల్ల ఇది ఇంకా పెరగవచ్చని ఆయన బీబీసీతో చెప్పారు. తమకు ఇకపై గ్రీన్ కార్డు రాకపోవచ్చని అనేకమంది నిపుణులు భావిస్తున్నారు. బ్యాక్2 ఇండియాను సంప్రదిస్తున్న వారి సంఖ్య పెరిగింది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత మాకు వచ్చే కాల్స్ మూడురెట్లు పెరిగాయి. గత 6 నెలల్లో 200 మందికి పైగా ఎన్ఆర్ఐలు, తిరిగి రావడానికి ఉన్న అవకాశాల గురించి అడిగారు" అని హసన్ చెప్పారు. అమెరికా యూనివర్సిటీల్లో భారతీయ ప్రతిభావంతుల కోసం వెదుకుతున్న వాళ్లు ఈ మార్పు నిజమేనంటున్నారు."ఐవీ లీగ్ యూనివర్సిటీల్లో చదువుతూ, చదువు పూర్తైన తర్వాత ఇండియా వెళ్లిపోవాలని భావిస్తున్న విద్యార్థుల సంఖ్య ఈ సీజన్‌లో 30శాతం పెరిగింది" అని బీడీఓ ఎగ్జిక్యూటివ్ సెర్చ్ సీఈఓ శివానీ దేశాయ్ చెప్పారు. ఈ అనిశ్చితి భారత సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను అమెరికాలో తమ కెరీర్ గురించి తీవ్రంగా ఆలోచించేలా చేస్తోందని ఆమె అన్నారు."అనేకమంది ఇప్పటికే ఇక్కడ స్థిరపడినప్పటికీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, ఇతర సీనియర్ మేనేజర్లు భారత్‌కు వెళ్లిపోవడాన్ని సీరియస్‌గా ఆప్షన్‌గా భావిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది" అని దేశాయ్ చెప్పారు. భారత్‌లోని బహుళజాతి కంపెనీల రిమోట్ కార్యాలయాలు లేదా గ్లోబల్ కేపబలిటీ సెంటర్లు (జీసీసీ) పెరిగాయి. ఈ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉండటం కూడా సొంత దేశానికి వెళ్లాలనుకునే భారతీయుల ఆలోచనకు బలం చేకూరుస్తోంది. టెక్ నిపుణులకు అమెరికా ద్వారాలు మూస్తే, ఈ కార్యాలయాలు అలాంటి నిపుణులకు కేంద్రంగా మారవచ్చు. దీని వల్ల జీసీసీలు ప్రతిభావంతులకు మరింత ఆకర్షణీయంగా మారతాయని అస్సెట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ తెలిపింది. అమెరికాకు వలస వెళ్లిన మేథో సంపత్తిని తిరిగి తీసుకు రావడానికి ప్రభుత్వం వైపు నుంచి సీరియస్‌గా ప్రయత్నం జరగాలని, అయితే ప్రస్తుతం అది కనిపించడం లేదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుగా పని చేసిన సంజయ్ బారు చెప్పారు."తాను వెనక్కి రప్పించాలని భావిస్తున్న అగ్రశ్రేణి శాస్త్రవేత్తలు, నిపుణులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను విదేశాలకు వెళ్లి గుర్తించాలి. ఈ ప్రయత్నం ప్రభుత్వంలో ఉన్నత స్థాయి నుంచి జరగాలి" అన్నారు. అంతరిక్షం, అణు సాంకేతికతవంటి రంగాలలోని ప్రతిభావంతుల్ని స్వదేశానికి తీసుకురావడానికీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వంటి సంస్థలను ఏర్పాటు చేయడానికీ భారత తొలి ప్రధాని నెహ్రూ ఆ రోజుల్లో ఇలాగే చేశారని సంజయ్ బారు గుర్తు చేశారు. ఇక్కడి ప్రతికూలతలు అంటే చట్టపరమైన నిబంధనలు, అధికార యంత్రాంగపు నిర్లక్ష్య వైఖరి, వ్యాపారానికి అనుకూలమైన పరిస్థితులు కల్పించకపోవడం వంటివి దశాబ్దాలుగా సంపన్నులు, అధిక సంపాదన కలిగిన భారతీయులు వలస వెళ్లి పోవడానికి ప్రధానమైన కారణాలు. 2020 నుంచి దాదాపు 5 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు పౌరసత్వం వదులుకోవడం, ఇతర దేశాలలో స్థిరపడుతున్న మిలియనీర్లు అధికంగా ఉన్న టాప్ 5 దేశాలలో భారత్ కూడా ఒకటి. విదేశాల్లో ఉన్న భారతీయులను తిరిగి తీసుకు వచ్చే విషయంలో ప్రభుత్వం నిజంగా సీరియస్‌గా ఉంటే, అనేక అడ్డంకులను తొలగించాలని హాసన్ అన్నారు. ఇందులో సరళమైన పన్నుల విధానం, స్పెషల్ స్టార్టప్ వీసాలవంటి ప్రోత్సాహకాలతోపాటు, మౌలిక సదుపాయాలు, పెరిగిపోతున్న పట్టణ రద్దీ వంటి సమస్యలను కూడా పరిష్కరించాల్సి ఉంటుంది. అంటే దీని అర్థం, మేధావులు, విద్యావంతులు ఎదగడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టించాలని. "వారి సొంత దేశంలో పరిశోధన, అభివృద్ధిని మెరుగుపరచడం, విద్యలో స్థాయిని పెంచడం కూడా ఇందులో భాగంగా ఉండాలి" అని సంజయ్ బారు అన్నారు. ఎందుకంటే, గత 50 ఏళ్లలో భారతీయ ప్రతిభను అమెరికాకు ఇంతగా ఆకర్షించిన అంశాలు ఇవే.



# తగ్గిన డిమాండ్.. తగ్గిన మోజు!

## ఇమిగ్రేషన్ ఆంక్షలతో అమెరికా సంబంధాలపై

- ఇమిగ్రేషన్ ఆంక్షలతో ఎన్ఆర్ఐలపై నిరాసక్తత
- వీసా హోదా చూసి మరీ సంబంధాలపై ఆరా
- కెనడా, బ్రిటన్, యూరప్ పెండ్లి సంబంధాలపై ఆసక్తి

న్యూఢిల్లీ: అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయులంటే భారతీయ వివాహ మార్కెట్లో ఒకప్పుడు తిరుగులేని డిమాండ్ ఉండేది. ఆర్థిక భద్రత, మెరుగైన జీవన ప్రమాణాలకు హామీగా భావించే ఈ సంబంధాల పట్ల ఇప్పుడు కుటుంబాలు వెనుకంజ వేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన ఇమిగ్రేషన్ విధానాలు, ముఖ్యంగా హెచ్-1బీ వీసాపై ఆంక్షలు ఈ మార్పును తీసుకొచ్చాయి. హర్యానాకు చెందిన 19 ఏళ్ల మెడికల్ స్టూడెంట్ సిద్ధిశర్మ అమెరికాలో ఉద్యోగం చేస్తున్న భారతీయ పౌరుడిని పెళ్లి చేసుకోవాలని కలలు కనేది. అయితే, ట్రంప్ ఇమిగ్రేషన్ నిబంధనలు ఆమె ఆశలపై నీళ్లు చల్లాయి.

'అమెరికాలో స్థిరపడాలని కలలు కన్నాను. ట్రంప్ నా తలుపులు మూసేశారు' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ఇమిగ్రేషన్ విధానాలు కఠినతరం కావడం, ముఖ్యంగా హెచ్-1బీ స్కిల్డ్ వర్కర్ వీసాలపై ఆంక్షలు పెరగడంతో అమెరికా సంబంధాలపై భారతీయులలో మోజు తగ్గిపోయింది. తమ పిల్లలకు కాబోయే జీవిత భాగస్వామికి అమెరికాలో ఉద్యోగం లేదా ఇమిగ్రేషన్ హోదా ఎక్కడ పోతుందోనన్న భయం భారతీయ కుటుంబాలలోని తల్లిదండ్రులను వెంటాడుతోంది. గతంలో మాదిరిగా అమెరికా సంబంధాలపై భారతీయ కుటుంబాలలో వెంపర్లాట తగ్గిపోయిందని పెళ్లి సంబంధాలు కుదిర్చే సంస్థలు, విద్యావేత్తలు, పెళ్లీడు పిల్లలు తెలిపారు.

తగ్గిన డిమాండ్: సాధారణంగా మన దేశంలో అధిక శాతం వివాహాలు పెద్దలు కుదిర్చిన అరేంజ్డ్ మ్యారేజ్‌లే ఉంటాయి. ఇప్పుడిప్పుడే నగరాలలో ప్రేమ వివాహాలు పెరుగుతున్నప్పటికీ వాటికి కూడా పెద్దల మద్దతు క్రమంగా పెరుగుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే అమెరికాలో భారతీయ సంతతికి చెందినవారు, భారత జాతీయులే అత్యధికంగా నివసిస్తున్నారు.

భారత ప్రభుత్వ లెక్కల ప్రకారం 21 లక్షల మంది ప్రవాస భారతీయులు(ఎన్ఆర్ఐ) అమెరికాలో నివసి స్తున్నారు. వీరిలో పెళ్లీడు పిల్లల కోసం భారతదేశం నుంచి వేట జరుగుతుంటుంది. ఈ ఏడాది జనవరిలో ట్రంప్ మళ్లీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇమిగ్రేషన్ నిబంధనలు కఠినతరం చేయడంతో హెచ్-1బీ వర్క్ వీసాలపై చాలామంది ఆశలు వదులుకు న్నారు. అమెరికాలో స్థిరపడిన వ్యక్తిని పెళ్లి చేసుకుంటే ఆర్థిక భద్రత, మెరుగైన జీవితం లభిస్తుందని భారతీయ కుటుంబాలు ఆశిస్తుంటా యి. గత ఏడాది వరకు ఎన్ఆర్ఐ సంబంధాలపై మోజు ఎక్కువగా ఉండేదని వనజారావు క్విక్ మ్యారేజెస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వనజా రావు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి అమెరికా సంబం ధాల కోసం ఆరా తీసేవారి సంఖ్య క్రమంగా తగ్గిపోవడం మొదలైంద ని, గత ఆరు నెలల్లో అది మరింత తగ్గిపోయిందని ఆమె తెలిపారు. కొందరైతే పెళ్లి ముహూర్తాలను వాయిదా వేస్తున్నారని ఆమె చెప్పారు.

వివాహాలు వాయిదా..: ఇమిగ్రేషన్‌కు సంబంధించి చాలా అస్థిరత ఏర్పడిందని అట్లాంటాలో నివసించే ఓ 26 ఏళ్ల బారతీయ విద్యార్థి తెలిపారు. ట్రంప్ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఆంక్షల కారణంగా తనకు తెలిసి మూడు వివాహాలు వాయిదాపడినట్లు ఆయన చెప్పారు. హెచ్-1బీ వీసాలు, స్కిల్డ్ వర్కర్ ఇమిగ్రేషన్‌కు సంబంధించి ఆంక్షలు కఠినతరం కానున్నట్లు వార్తలు వచ్చిన ప్రతిసారి వివాహ మార్కెట్‌పై దాని ప్రతికూల ప్రభావం ఉంటోందని టొరంటో మెట్రోపాలిటన్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మర్షిత యలమర్తి తెలిపారు. ట్రంప్ కొత్త నిబంధనలను పురస్కరించుకుని అనేక మ్యాచ్ మేకింగ్ సర్వీసులు తమ పద్ధతులను మార్చుకుంటున్నాయి. కేనాట్.డేటింగ్ అనే వివాహపరిచయ వేదిక వధూవరుల వీసా స్థితిని తనయాప్‌లో పొందుపరిచే కొత్త విధానాన్ని ప్రారంభించింది. ఎన్ఆర్ఐ సంబంధాలపై చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారని, అయితే వీసాహోదా ఏమిటోముందుగానే ఆరా తీసి మరీ సంబంధం మాట్లాడుతున్నారని ఆ కంపెనీ సహవ్యవస్థాపకుడు, సీఈఓ జస్వీర్ సింగ్ చెప్పారు. సెప్టెంబర్‌లో తమ యాప్‌లో ఈ ఫీచర్‌ని ప్రారంభించిన తర్వాతదాదాపు 1,000 మంది ఎన్ఆర్ఐలు రిజిస్టంఅయ్యారని చె ప్పారు. ఇతర దేశాలవైపు చూపు: అమెరికా కల కరిగిపోతుండడంతో ఇప్పుడిప్పుడే కెనడా, బ్రిటన్, యూరపు, పశ్చిమాసియా సంబంధాలపై ఆరామొదలైందని వెడ్డింగ్ టేల్స్ మ్యాట్రిమోని వ్యవస్థాపకురాలు నికితా ఆనంద్ వెల్లడించారు. తమ పిల్లలకు పెళ్లి చేయాలన్న నిర్ణయం తీసుకున్న తల్లిదండ్రులు ముందుగా ప్రయాణ సౌకర్యాలు, భద్రత గురించి ప్రధానంగా ఆలోచిస్తారని, తమ పిల్లల దీర్ఘకాలిక స్థిరత్వమే కాకుండా భవిష్యత్ తరాల భరోసా గురించి ఆలోచిస్తారని అనురాధ గుప్తా అభిప్రాయపడ్డారు.

# ఆటోవాలా.. రోజు గడిచేది ఎలా?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమంలో భాగంగా వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది. అయితే మహిళలకు లబ్ధి చేకూర్చే ఉచిత బస్సు పథకం.. పరోక్షంగా ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసింది. ప్రయాణానికి ఆటోలను వినియోగించే మహిళలు.. ఉచి తం కావడంతో బస్సు ప్రయాణానికే మొగ్గు చూపుతు న్నారు. రోజంతా కష్టపడినా పూట గడవని దయ నీయ స్థితిలో ఆటో డ్రైవర్లు బతుకులు వెళ్లదీస్తున్నారు. వాస్తవానికి ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో డ్రైవ ర్లకు నష్టం కలుగుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ఏడాదికి రూ. 12,000 అందిస్తామని హామీ కూడా ఇచ్చింది. కానీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఉచిత బస్సు ప్రయాణ విధానంతో దెబ్బ తిన్న ఆటో డ్రైవర్లకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సంవత్స రానికి రూ. 15,000 అందిస్తున్నది. దీంతో ఆటో డ్రైవర్లకు అండగా నిలవడంలో ఏపీని ఆదర్శంగా తీసుకుని తమ జీవనోపాధిని కాపాడుకోవడానికి వార్షిక ఆర్థిక సహాయం అందించాలని తెలంగాణ ఆటో డ్రైవర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలు మనుగడ కోసం పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వ హామీ మాత్రం ఇప్పటికీ కాగితాలకే పరిమితమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ. 12,000 వార్షిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని తెలంగాణలోని యూనియన్లు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. 'తెలంగాణ ప్రభుత్వం వాగ్దానం చేసిన ఆర్థిక సహాయాన్ని వీలైనంత త్వరగా విడుదల చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం.- ఆర్థిక సహాయం లేకుండా వేలాది మంది డ్రైవర్లకు మనుగడ అసాధ్యంగా మారింది' అని తెలంగాణ ఆటో డ్రైవర్, కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఆటో యూనియన్ల జేఏసీ కన్వీనర్ బండారపు వెంకటేశం వాపోతున్నారు. 'మా ఆదాయాలు పడిపోయాయి, అప్పులు పెరుగుతున్నాయి, పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది.' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ అంతటా ఆటో డ్రైవర్లు జీవనోపాధికి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులోకి తీసుకురావడంతో పాటు.., ఓలా, ఉబర్ వంటి ప్రైవేట్ రైడ్- హెయిలింగ్ ప్లాట్‌ఫామ్‌ల ఆధిపత్యం వల్ల అటోవాలాల రోజువారీ ఆదాయం తగ్గింది. చాలా మందిని పేదరికంలోకి నెట్టింది. ఈ నష్టాలను పూడ్చడానికి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ఉపశమనం ప్రవేశపెట్టినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీ మాత్రం ఇంకా నెరవేరలేదు. హైదరాబాద్‌లో 3 లక్షలకు పైగా ఆటో డ్రైవర్లు, తెలంగాణ అంతటా 10 లక్షలకు పైగా- అంటే దాదాపు 25 లక్షల మంది ఈ వృత్తిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్నారు. రాష్ట్ర రవాణా నెట్‌వర్క్‌లో వారిది కీలక పాత్ర అయినప్పటికీ, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సంక్షేమ పథకాలేవి అందుబాటులో లేవు. పరిస్థితిని మరింత దిగజార్చే విధంగా ఇంధన ధరలు, జీవన వ్యయం విపరీతంగా పెరిగినప్పటికీ, ఛార్జీలు మాత్రం ఇప్పటికీ కనీసం రూ. 20, కిలోమీటరుకు రూ. 12 గానీ ఉంది. చాలా మంది డ్రైవర్లు ఇప్పుడు నెలకు రూ. 15,000 నుంచి రూ. 20,000 మాత్రమే సంపాదిస్తున్నారు. ఇంటి కిరాయి, కిరాణా సామాగ్రి, పిల్లల పాఠశాల ఫీజులు వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడానికి కూడా వారి ఆదాయం సరిపోవడం లేదు. వాహనాలను అద్దెకు తీసుకునే వారు మరింత దారుణమైన పరిస్థితిలో ఉన్నారు. రోజుకు రూ. 400 నుంచి రూ. 500వరకు ఆటోకకిరాయి చెల్లిస్తున్నారు. ఈ గణాంకాలన్నీ ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సంక్షోభం స్థాయిని వెల్లడిస్తున్నాయి. మేము రోజుకు10నుండి 12 గంటలు పని చేస్తాం, కానీ ఇప్పటికీ మా జీవితాలు మారాలేదు' అని ఆటో డ్రైవర్ వెంకటేశం చెబుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే రైడ్-బుకింగ్ అప్లికేషన్ వారి భారాన్ని గణనీయంగా తగ్గించగలదని కూడా ఆయన అభిప్రాయపడుతున్నారు.

# సోలో బతుకే సో బెటర్ కమలం దారి అదేనా..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ బీజేపీ ఒక విషయంలో మాత్రం స్పష్టంగా ఉంది. ఏ ఎన్నిక జరిగినా ఒంటరి పోరాటానికే సిద్ధమవుతుంది. మిగిలిన పార్టీల నేతలను తమలో కలుపుకుని మరింత బలోపేతమై తెలంగాణ రాష్ట్రాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తుంది. మిగిలిన రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నప్పటికీ తెలంగాణలో మాత్రం అందుకు ససేమిరా అంగీకరించడం లేదు. సొంతంగా తెలంగాణలో ఎదగడమే దాని అసలు లక్ష్యంగా కనిపిస్తుంది. రాష్ట్ర నాయకులు మాత్రమే కాదు.. కేంద్ర నాయకత్వం కూడా ఈ విషయంలో ఒకే మాట.. ఒకే తీరు. తమకు ఎవరితోనూ పొత్తు అవసరం లేదన్న అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేస్తున్నారంటే బీజేపీ లో అంత కాన్ఫిడెన్స్ ఎందుకు పెరిగిందన్న దానిపై రాజకీయంగా చర్చ జరుగుతుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ ఒంటరి పోరు చేయాలని నిర్ణయించింది. 2014కు ముందు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఉమ్మడి రాష్ట్రంగా ఉండేవి. అప్పుడు పార్టీ అధ్యక్ష పదవిలో ఎవరున్నప్పటికీ రెండు చోట్ల పెద్దగా పార్టీకి ఎదుగుదల కనిపించలేదు. కానీ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత మాత్రం ఆంధ్రప్రదేశ్ లో తన బలాన్ని ఏ మాత్రం పెంచుకోలేకపోయింది. అయితే అక్కడ కూటమిని కట్టింది. తెలుగుదేశం పార్టీ, జనసేనతో కలిసి అధికారంలోకి రాగలిగింది. అవసరమైన స్థానాలను పొందగలిగింది. రాష్ట్ర విభజన జరిగిన తొలి ఎన్నికలోనూ టీడీపీ, బీజేపీ కలసి పోటీ చేసి అధికారంలోకి రాగలిగాయి. 2019 ఎన్నికల్లో విడిగా పోటీ చేసి ఓటమిని చవిచూశాయి. బీజేపీకి అయితే ఒక్క శాతం ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అందుకే 2024 ఎన్నికల్లో మూడు పార్టీలు కలసి సూపర్ విక్టరీని సాధించాయి. దసరా షాపింగ్ గైడ్రెడీ అయిపోండి దొరా సొంతంగా గ్రాఫ్ పెంచుకునేలా... ఇక తెలంగాణలోకి వచ్చేసరికి బీజేపీ గ్రాఫ్ సొంతంగా పెంచుకుంటూ పోతుంది. 2014 ఎన్నికల్లో కొన్ని సీట్లను గెలిచిన బీజేపీ 2018 శాసనసభ ఎన్నికల్లో మాత్రం కేవలం ఒక్క స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే 2023 ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా భారతీయ జనతా పార్టీ ఎనిమిది స్థానాల్లో గెలిచింది. అలాగే 2024 పార్లమెంటు ఎన్నికల్లోనూ ఎనిమిది పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించి మరింత గ్రాఫ్ ను మెరుగుపర్చుకుంది. అందుకే ఏపీలో కూటమి ఉన్నప్పటికీ, తెలంగాణలో మాత్రం తెలుగుదేశం పార్టీ, జనసేనలతో పొత్తు ఉండబోదని ఆ పార్టీ నేతలు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. తెలంగాణలో ఆ రెండు పార్టీలు సీమాంధ్రకు చెందిన పార్టీలుగా గుర్తింపు పొందడంతో దూరం పెట్టారన్నది వాస్తవం. వచ్చే నెలలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికలోనూ బీజేపీ పొత్తు పెట్టుకునే అవకాశాలు లేవన్నది పార్టీ నేతల అభిప్రాయంగా ఉంది. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో టీడీపీతో పాటు సినిమావాళ్లు ఎక్కువగా ఉన్నప్పటికీఈ రెండు పార్టీలతో పొత్తుకు కమలనాథులు సిద్ధంగా లేరన్నది వాస్తవం. ఒక్కసారి పొత్తు పెట్టుకుంటే రాజకీయంగా ఆంధ్ర సెంటిమెంట్ ను ప్రత్యర్థులు పైకి ఎగదోసే అవకాశముందని భావించి పొత్తు లేదని ముందుగానే నేతలు కుండబద్దలు కొట్టేస్తున్నారు. కూటమి అంత వరకే ఉంటుందని, బార్డర్ దాటి ఇటు వైపు మాత్రం రాదని తెలంగాణ బీజేపీ నేతలు నమ్మకంగా చెబుతున్నారు.

# వైసీపీ ఉక్కు రాజకీయం




**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**ఏ రాష్ట్రంలోనైనా సరే ప్రతిపక్షాలు బలపడేది ప్రజా ఉద్యమాల ద్వారానే. ఇది చాలాసార్లు రుజువైన విషయం. ఏపీలో 2024 తర్వాత విపక్షాలకు కలిసివచ్చిన అలాంటి అంశాలు చాలా తక్కువ. చేసిన కొద్దిపాటి ఉద్యమాలు నిరసనలు రాష్ట్రం మొత్తాన్ని కదిలించే అంశాలు కావు. కొన్ని ముఖ్యమైన అంశాలు అలాంటివి దొరికినా వాటిని విపక్షాలు సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. అలాంటి వాటిలో రాయలసీమ మామిడి రైతుల ఆందోళన, నెల్లూరు జిల్లా కర్రేడులో భూములు కోల్పోతున్న గ్రామస్తుల నిరసన, పెరిగిపోయిన విద్యుత్ బిల్లుల అంశాల వంటివి ముఖ్యం. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై ఇంతవరకు విపక్షాలు కలిసికట్టుగా ముందుకు దిగిన ఉద్యమాలు లేనే లేవు. పోనీ ప్రధాన విపక్షాలుగా భావించే పార్టీలు ఒంటరిగానన్నా ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ఉద్యమానికి దిగాయా అంటే అదీ లేదు. అలాంటి తరుణంలో ప్రధాన విపక్షం వైసీపీకి ఒక ముఖ్యమైన ఆయుధంలా మారే ఛాన్స్ “ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ “ అంశం ద్వారా వస్తోంది.'ఆంధ్రుల హక్కు -విశాఖ ఉక్కు' నినాదంతో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్న సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. ఒకపక్క స్టీల్ ప్లాంట్‌ని ఆదుకుంటామని చెబుతున్న కేంద్రం మరోవైపు “పెట్టుబడుల ఉపసంహారణకు సంబంధించి” గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని చెబుతోంది. దీంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు కార్మికులలతోపాటు సగటు తెలుగువాడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం అయిపోతుందన్న నమ్మకానికి దగ్గరవుతున్నారు. ప్రతి నెల వీఆర్ఎస్ తీసుకునే ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో పాటు తాజాగా 32విభాగాలను ప్రైవేట్‌పరం చేశారంటూ వస్తున్న వార్తలు ఏళ్ల తరబడి ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగుల నమ్మకంపై దెబ్బకొడుతున్నాయి. అయితే ప్రైవేటు పరం కాకుండా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామంటూ కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించలేకపోతున్నాయి అనేది వాస్తవం అని వామపక్ష నేతలు చెప్తున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు చేస్తున్న పోరాటానికి బలం సరిపోవడం లేదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉద్యమించడానికి విపక్ష వైసిపికి ఇది అద్భుతమైన అవకాశమని ఎనలిస్టులు చెప్తున్నారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లు వారు చెప్పినట్టుగానే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం నెమ్మదించింది. ప్రవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోకపోయినప్పటికీ దానిపై ముందుకు కూడా వెళ్లలేదు. కాబట్టి ఐదేళ్లు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం అనే క్లయిమ్ వైసిపి నేతలు చేసుకుంటున్నారు. ఇప్పుడు దాన్ని ఆధారంగా చేసుకుని స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగులతో కలిసి ఉద్యమించే అవకాశం వైసీపీకి ఉంది. నిజంగా అలా చేస్తే ప్రజల్లో పార్టీ ఇమేజ్ కూడా పెరుగుతోంది. కానీ రాష్ట్రంలో తన ప్రత్యర్థులతో కలిసి ఉన్న బిజెపికి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కేంద్రంలో మద్దతిచ్చిన వింత పరిస్థితి వైసిపిది. చంద్రబాబు, పవన్ పై ఒంటికాలిపై లేచే జగన్మోహన్ రెడ్డి బీజేపీపై అంతే తీవ్రంగా ఈ అంశంపై పోరాడగల ధైర్యం చేస్తారా అనేది రాజకీయవర్గాల్లో చర్చగా మారింది. పోలవరం, అమరావతి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఈ మూడు ప్రస్తుతం ఆంధ్రుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్నవి. అమరావతిపై వైసీపీ ఇప్పటికీ అస్పష్టమైన స్టాండ్ తోటే ఉంది . పోలవరం నిర్మాణాన్ని రివర్స్ టెండరింగ్ పేరుతో ఐదేళ్లు వెనక తీసుకుపోయిందంటూ టిడిపి పదే పదే ఆరోపణలు చేస్తున్నా దానికి సరైన కౌంటర్ వైసీపీ నుంచి రావడం లేదు. ఇక వారికి మిగి లింది వైజాగ్ స్టీల్ ప్లాంట్. కూటమి నేతల అస్పష్ట ప్రకటనల మధ్య స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విపక్షాలు ఉద్యమిస్తే కచ్చితంగా ప్రజలు మద్దతు వారికి ఉంటుంది.

# రామాయపట్నం దిశ తిరిగినట్టే

**ఒంగోలు,తెలంగాణ దిశ :**దేశంలో ఇంధన డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ భారీ ప్రణాళికతో ముందుకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం పోర్టు సమీపంలో ఒక అత్యాధునిక చమురు రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వ రంగ సంస్థ యోచిస్తోంది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను ప్రస్తుతం పరిశీలిస్తోంది.ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి, వినియోగదారు దేశం మనదే. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా చమురు డిమాండ్ 2.5 మిలియన్ బ్యారెల్స్ పెరుగుతుందని అంచనా వేయగా, అందులో కేవలం భారత్‌లోనే రోజుకు 1 మిలియన్ బ్యారెల్స్ డిమాండ్ పెరగనుందని బీపీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ఖన్నా జరిగిన సంస్థ వార్షిక వాటాదారుల సమావేశంలో తెలిపారు.ఈ భారీ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే వ్యూహంలో భాగంగానే బీపీసీఎల్ ఈ కొత్త ప్రాజెక్టును చేపడుతోంది. “భారత్ వృద్ధి సామర్థ్యాన్ని గుర్తించి, ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం పోర్టు సమీపంలో కొత్త రిఫైనరీ- కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని బీపీసీఎల్ ఆలోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రాజెక్ట్ పూర్వ కార్యకలాపాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి” అని సంజయ్ ఖన్నా అన్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక వివరాలు, సామర్థ్యాన్ని ఆయన వెల్లడించనప్పటికీ, గతంలో సంస్థ యాజమాన్యం ఇచ్చిన సమాచారం ప్రకారం... ఏటా 9 మిలియన్ టన్నుల సామర్థ్యం గల ఈ యూనిట్ నిర్మాణానికి సుమారు రూ.95,000 కోట్లు ఖర్చవుతుం దని అంచనా. ఈ వ్యూహాత్మక పెట్టుబడి బీపీసీఎల్ పెట్రోకెమికల్ వ్యాపార సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు, భారతదేశాన్ని ప్రపంచ రిఫైనింగ్, పెట్రోకెమికల్ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని ఖన్నా వివరించారు.బీపీసీఎల్ రాబోయే 50 ఏళ్ల అవసరాలను తీర్చడానికి 'ప్రాజెక్ట్ ఆస్పైర్'ను చేపట్టింది. ఈ ప్రాజెక్టులో రిఫైనింగ్, మార్కెటింగ్, అప్‌స్ట్రీమ్ రంగాలను బలోపేతం చేయడంతో పాటు, పెట్రోకెమికల్స్, పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయెల్స్, గ్యాస్ రంగాల్లోకి అడుగుపెట్టనుంది. “ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు, భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక సరికొత్త ఆలోచన”



అని ఆయన పేర్కొన్నారు.50 ఏళ్ల క్రితం కేవలం 3.8 మిలియన్ టన్నుల ముడి చమురును పెట్రోల్, డీజిల్‌గా మార్చే ఒకే ఒక రిఫైనరీతో ప్రారంభమైన బీపీసీఎల్, ఇప్పుడు 40.5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో మూడు రిఫైనరీలను కలిగి ఉంది. 50 ఏళ్ల క్రితం 3.6 మిలియన్ టన్నుల ఉత్పత్తులను విక్రయించిన సంస్థ, ఇప్పుడు 52.4 మిలియన్ టన్నులకు పైగా పెట్రోలియం ఉత్పత్తులను అందిస్తోంది. “అప్పట్లో మా టర్నోవర్ రూ.552 కోట్లు, లాభం రూ.1.7 కోట్లు. ఇప్పుడు టర్నోవర్ రూ.5 లక్షల కోట్లు దాటగా, లాభం రూ.13,275 కోట్లకు చేరింది” అని ఆయన తెలిపారు.2040 నాటికి నెట్ జీరో ఉద్గారాలు సాధించాలని బీపీసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, 2035 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన పోర్ట్‌ఫోలియోను నిర్మించాలని యోచిస్తోంది. ప్రస్తుతం సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టుల ద్వారా దాదాపు 155 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 71 మెగావాట్ల సోలార్ ప్లాంట్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో 50 మెగావాట్ల రెండు విండ్ ఫారాల వంటి ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి.పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల కోసం సింగపూర్‌కు చెందిన సెంబ్‌కార్ప్ గ్రీన్ హైడ్రోజన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో బీపీసీఎల్ ఒక జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసుకుంది. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో, బీనా రిఫైనరీ వద్ద 5 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ యూనిట్‌ను ప్రారంభించింది. హైడ్రోజన్‌తో నడిచే బస్సులు, వీటీఓఎల్ విమానాల వంటి అత్యాధునిక ఆవిష్కరణలను కూడా సంస్థ అన్వేషిస్తోందని ఆయన తెలిపారు.

# భూసమస్యలను కాలయాపన లేకుండా త్వరగా పరిష్కరించాలి

**గుట్టలు గుట్టలుగా దరఖాస్తులు అరకొరగా పరిస్కారమా?**

**అన్నం పెట్టె అన్నదాతలను అరిగోసపెట్టకండి**

**జిల్లా అదనపు కలేక్టర్ ని కోరిన మద్దెల దినేష్**



**రామగుండం,తెలంగాణ దిశ :**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా ఏర్పాటు చేసిన రేవన్యూ సదస్సులో జిల్లాలో చాలా మంది రైతులు వివిధ రకాల భూ సమస్యల పరిష్కారం కోసం మీ సేవలలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సుల్లో, జిల్లా కేంద్రంలోని, మరియు స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయాలలో గత కొన్ని సంవత్సరాలుగా దరఖాస్తులు చేసుకున్న ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం కావడంలేదని ఫైట్ ఫర్ బెటర్ సోసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలేక్టరేట్ ఛాంబర్ లోని ప్రజావావాణిలో అదనపు కలేక్టర్ వేణు గారిని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కారం కోసం బాధితులు వారి కుటుంబ సభ్యులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, జిల్లా కలెక్టర్, స్థానిక మండలాల తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా అనేక విధాలుగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గొప్పగా ప్రచారం చేసి రైతంగం సమస్యలు పరిష్కరస్తామని గొప్పలు చెప్పడం జరిగిందని, గత ప్రభుత్వం ధరణి చట్టం వల్ల సరైన ఆప్షన్స్ లేక కబ్జా లో ఉన్న వారికి పట్టా పాస్ బుక్ లేక పోవడం, వారసులు మరణించిన వారి భూములను కూడా వారి కుటుంబ సభ్యుల పేర్ల పై క్రమబద్ధీకరణ చేయకపోవడం, భూమి ఎక్కువగా ఉంటే తక్కువగా, తక్కువగా ఉంటే ఎక్కువగా ఉండడం లాంటివి నమోదైనాయని, అలాగే గతంలో కొనుగోలు చేసిన భూములు పట్టా పాస్ బుక్ లలో అసైన్డ్ భూములని పడడం జరిగిందని, ఇలాంటివి భూ భారతి చట్టం ద్వారా అర్హులైన రైతులకు సవరణ చేస్తారనుకుంటే అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, దాని వల్ల రేవన్యూ సదస్సులు ఉపయోగం లేకుండా పోయిందని, అలాగే జిల్లాలో కొన్ని గ్రామాల్లో రాజకీయ నాయకుల, కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండ లతో బ్రతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వచ్చిన వారి భూములను అక్రమంగా ఆర్ఓఆర్ చేయించుకొని రైతు బంధు తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలను అక్రమంగా పొందుతూ వలస పోయిన వారికి అన్యాయం జరిగిందని, జిల్లాలో ఇంకా అనేక రకాల భూసమస్యల పరిష్కారానికి నోచుకోక బాధితులు ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూసమస్యలను సులభంగా పరిష్కారం చేయాలనే ఆలోచనతో మేధావులతో చర్చించి భూభారతి చట్టం ప్రవేశపెట్టి దాని ప్రకారం బాధితులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రభుత్వం ఏమో భారీగా ప్రచారం చేస్తూ లోపు భూసమస్యల ను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, పరిష్కారం చేయలేదని దీని వల్ల భూసమస్యల బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కావున జిల్లాలో ఉన్న ప్రతి భూసమస్యలను పరిష్కరించాలని, వాటి కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని మీ ద్వారా వారికి న్యాయం చేయాలని కొరామని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడుతలలో 605 మండలాలో 10,889 రేవన్యూ సదస్సులు జరగ్గ 8,27,330 దరఖాస్తులు వచ్చాయాని సమాచారం, ఇందులో కేవలం 8.53 శాతం దరఖాస్తులనే అమోదించారని, ఇందులో ఆన్లైన్ లో నమోదు చేసిన దరఖాస్తులు 2.52 శాతమే ఉన్నాయని సమాచారం ఇక పెద్దపల్లి జిల్లాలో చూసుకుంటే వాటిని బట్టి అర్థం చేసుకోవచ్చున్నారు. అన్నం పెట్టె అన్నదాతలను అరిగోస పెట్టకుండా రైతుల సమస్యలను పరిష్కరించాలని దినేష్ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు.

# భాగ్యనగరానికి బీచ్..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన చారిత్రక కట్టడాలు, సంస్కృతికి హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది. అయితే, సముద్ర తీరం లేకపోవడంతో బీచ్ అనుభూతిని పొందాలంటే నగరవాసులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం లేదు. ముత్యాల నగరానికి త్వరలో కృ త్రిమ బీచ్ అందాలు తోడవ్వబోతున్నాయి.ఈ కృత్రిమ బీచ్‌ను నిజమైన బీచ్‌కు ఏమాత్రం తగ్గకుండా రూపొందించనున్నారు. ఇక్కడ సందర్శకుల కోసం అనేక ఆకర్షణీయమైన ఏర్పాట్లు చేయబోతున్నా రు. జల విలాసాలు... ఈ ప్రాజెక్టులో ము ఖ్యంగా ఆకట్టుకునే అంశం నీటిపై తేలియాడే విల్లాలు. వీటితో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు కూడా ఏర్పాటు చేస్తారు. సాహస క్రీడలు... థ్రిల్ కోరుకునే వారి కోసం బంగీ జంపింగ్, స్కేటింగ్, సెయిలింగ్ వంటి సాహస క్రీడలు అందుబాటులో ఉంటాయి.వీటికి తోడు ప్రత్యేకంగా వింటర్ స్పోర్ట్స్‌ను కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. కుటుంబ వినోదం... కుటుంబంతో కలిసి ఆనందించేందుకు వీలుగా పార్కులు, పిల్లల ఆట స్థలా లు, సైక్లింగ్ జోన్లు, జాగింగ్ ట్రాక్లు ఉంటా యి. అదనపు ఆకర్షణలు.. ఫుడ్ కోర్టులు, థియేటర్లు, అలంకార ఫౌంటెన్లు, వేవ్ పూల్స్ వంటి విశ్రాంతి స్థలాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. అన్ని రకాల సదుపాయాలతో ఇది కేవలం ఒక బీచ్గా కాకుండా, ఒక సంపూర్ణ వినోద కేంద్రంగా మారబోతోంది.ఔటర్ రింగ్ రోడ్కు సమీపంలో ఉండటంతో నగరంలో ఎక్కడి నుంచైనా సులభంగా చేరుకునే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయి తే హైదరాబాద్ పర్యాటక రంగంలో కొత్త అధ్యాయం మొదలవుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.హైదరాబాద్‌లో మొట్టమొదటి అర్టిఫిషియల్ బీచ్ ఈ ఏడాది డిసెంబర్‌లో కొత్వాల్ గూడ వద్ద ప్రారంభం కానుంది. రూ.225 కోట్ల బడ్జెట్‌తో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్, సముద్ర తీర అనుభవాన్ని అందించే మానవ నిర్మిత సరస్సు. ఇక్కడ అడ్వెంచర్ స్పోర్ట్స్, ఫ్లోటింగ్ విల్లాస్, వేవ్ పూల్స్ వంటి సౌకర్యాలతో నగరవాసులకు వారాంతపు వినోదాన్ని అందించనుంది.సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ అర్టిఫిషియల్ బీచ్, సముద్ర తీరాన్ని పోలిన అనుభవాన్ని అందించేలా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ డీపీఆర్ ఇప్పటికే సిద్ధమైంది. అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర టూరిజం రంగంలో కీలకమైన అడుగుగా చెబుతున్నారు. ఈ అర్టిఫిషియల్ బీచ్ కేవలం ఇసుక, నీటితో మాత్రమే పరిమితం కాదు. ఇందులో ఫ్లోటింగ్ విల్లాస్, స్టార్-కేటగిరీ హోటళ్లు, వేవ్ పూల్స్, ఫుడ్ కోర్టులు, థియేట్రికల్ వేదికలు, డెకరేటివ్ ఫౌంటైన్స్, పార్కులు, సైక్లింగ్ ట్రాక్‌లు, స్కేటింగ్, బంజీ జంపింగ్, సెయిలింగ్, సిమ్యులేటెడ్ వింటర్ స్పోర్ట్స్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఈ సౌకర్యాలు కుటుంబాలకు ఒక రోజంతా ఆనందించే అనుభవాన్ని అందించేలా సిద్ధం చేస్తారు. తెలంగాణలో టూరిజం రూ. 15,000 కోట్ల స్థాయిలో ఉంది. ఈ అర్టిఫిషియల్ బీచ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ నగరవాసులకు నగరం వెలుపల ప్రయాణం చేయకుండానే వారాంత వినోదాన్ని అందించడంతో పాటు, హైదరాబాద్‌ను ఒక డైనమిక్ అర్బన్ రిట్రీట్‌గా రూపొందించనుంది.

## అసిఫ్ నగర్ పిఎస్ హెచ్ఎం ఉద్యోగ విరమణ సన్మానం



**కరీంనగర్,తెలంగాణ దిశ :**ఎంపీపీఎస్అసిఫ్ నగర్‌పిఎస్ హెచ్ ఎం చేన్నమనేని ఆంజనేయరావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికిటి పిటిఎఫ్ జిల్లా శాఖ తరపున ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జంకె రామచంద్రారెడ్డి మాట్లాడు తూ... ఆంజనేయరావు 29 సంవత్స రాల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులకు విద్యా రంగానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల బాలయ్య, రాష్ట్ర కౌన్సిలర్ కోలుగూరి కిషన్ రావు, సీనియర్ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు కోల రాజమల్లు, జిల్లా బాధ్యులు ఆర్. చంద్రశేఖర రావు, ఎన్.బాలయ్య, రాజశేఖర్ రెడ్డి తదితరులు హాజరై సన్మానించారు.

# వివేకా హత్య కేసు, సుగాలి ప్రీతి..

# కేసులను ఛేదించడం ఎలా

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా వాటికి ప్రాణం వచ్చినట్లు అయ్యింది. ముఖ్యంగా అమరావతికి ఊపిరి పోసింది కూటమి ప్రభుత్వం. అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించగలిగింది. అయితే రాష్ట్రంలో సంచలనంగా మారిన వివేకానంద రెడ్డి హత్య కేసు, సుగాలి ప్రీతి హత్య కేసులు కూడా త్వరగా ఛేదించి నిందితులకు శిక్షపడేలా కూటమి ప్రభుత్వం చేస్తుందన్న నమ్మకం కలిగింది. కానీ ఏడాదిన్నర అవుతున్న ఈ రెండు కేసులు కనీస స్థాయిలో కూడా ముందుకు కదలకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈ రెండు కేసులను వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చిందన్న ఆరోపణలు, అనుమానాలు ఉన్నాయి. కానీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి వీటినే లేవనెత్తింది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రెండు కేసులను తేల్చేస్తామని ప్రకటనలు చేశారు. అందుకే టిడిపి మెడకు వివేకానంద రెడ్డి హత్య కేసు.. జనసేన మేడకు సుగాలి ప్రీతి కేసు చుట్టుకున్నాయి. వాటిని తేల్చకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ఆ రెండు పార్టీలు మూల్యం చెల్లించుకోవడం తప్పదువైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు సంచలనంగా మారింది. గుండెపోటు, నారా సుర రక్త చరిత్ర, సిబిఐ అంటూ రకరకాలుగా వైసిపి దారులు మళ్లించింది. కానీ ఆ గొడ్డలి వేటు రక్తపు మరకలు మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు చూపించాయి. ఈ హత్య ఆరోపణలన్నీ వైఎస్ కుటుంబ సభ్యులు చుట్టే తిరిగాయి. అవినాష్ రెడ్డి నేరస్తుడు అంటూ వివేక కుమార్తె సునీత, జగన్ సోదరి షర్మిల టార్గెట్ చేశారు. అందుకు తగ్గ ప్రాథమిక ఆధారాలను కూడా బయటపెట్టారు. అయినా సరే వైసీపీ హయాంలో కేసు విచారణ అడుగు ముందుకు పడలేదు. అవినాష్ రెడ్డి చుట్టూ జగన్ వలయంగా ఏర్పడి కాపాడగలిగారు అన్నది బహిరంగ రహస్యం.వివేకా కేసులో సునీతకు న్యాయం జరగాలి.. హూ కిల్డ్ బాబాయ్ అన్న ప్రశ్నకు జవాబు చెప్పాలి అంటూ గత ఐదేళ్లలో తెలుగుదేశం పార్టీ భారీ స్లోగన్ ఇచ్చింది. జగన్మోహన్ రెడ్డితో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కు పెట్టింది. దోషులకు కొమ్ముకాస్తున్నారంటూ జగన్ పై నేరుగా టిడిపి కార్యకర్తల నుంచి నేతల వరకు విమర్శలు చేస్తూనే వచ్చారు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర సమీపిస్తుంది. ఇంకా వివేకా కేసు విషయంలో అసలు వాస్తవాలు బయటకు రావడం లేదు. సునీత ఆరోపిస్తున్న వ్యక్తులు ధైర్యంగా తిరగ గలుగుతున్నారు. వివేకా కుమార్తె సునీత పోరాటానికి ఫలితం దక్కలేదు. కానీ వైసీపీ హయాంలో సునీతతో పాటు ఆమె భర్తపై పెట్టిన కేసులను మాత్రం కోర్టు కొట్టి వేయడం ఉపశమనం. అంతకుమించి ఈ కేసు ముందుకు సాగలేదు. అధికారుల సైతం ఈ కేసు విచారణ పూర్తయిందని కోర్టుకు నివేదించారు. ఈ మొత్తం ఎపిసోడ్లో ఇంకా గందరగోళం నడుస్తోంది.ఇదిలా ఉంటే సుగాలి ప్రీతికేసు జనసేన మేడకు చుట్టుకుంది. 14 సంవత్సరాల గిరిజన బాలికను దారుణంగా హత్య చేశారు. చేయకూడని పని చేసి మట్టుపెట్టారు.

ఈ కేసు ఏపీలో సంచలనంగా మారింది. అయితే ఈ కేసు మూలాలను, సాక్షాలను వైసిపి ప్రభుత్వం తుడిచేసింది అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారుపవన్ కళ్యాణ్. సుగాలి ప్రీతి హత్యకు గాను ఆమె కుటుం బానికి న్యాయం చేయాలని.. వారి పోరాటాలకు ఫలితం దక్కాలి అంటూ నాడు వైసిపి ప్రభుత్వ హయాంలో పవన్ హీరో చిత పోరాటం చేశారు. దీంతో ఈ కేసు బాధ్యత జనసేనపై పడింది. కూటమిలో కీలక భాగస్వామిగా ఉండడంతో ఇప్పుడు పవన్ ఈ కేసును తేల్చాల్సి వస్తోంది. సుగాలి తల్లి నేరుగా పవన్ పై ఇప్పుడు విమర్శలు చేయడంతో ఆయన స్పందించాల్సి వచ్చింది.

జనసేన పోరాట ఫలితం మూలంగానే ఆ కుటుంబానికి న్యాయం జరిగిందని.. కానీ సుగాలి ప్రీతి కేసు లో నిందితులకు శిక్ష పడితేనే అసలు న్యాయం జరిగినట్టని పవన్ కళ్యాణ్ చెప్పారు. అయితే ఈ రెండు కేసులను టిడిపి కూటమి తేలిగ్గా తీసుకుంటే మాత్రం ఇబ్బందికరమే.ఈ రెండు కేసులలో అసలు దోషులు ఎవరు? అనేది నిరూపించ లేకపోతే టిడిపి కూటమికి ఇబ్బందికరమే. నిరూపించ గలిగితే మాత్రం వైసీపీ అరాచకానికి ఫుల్ స్టాప్ పెట్టిన వాళ్ళు అవుతారు.

## బదిలీపై వెళుతున్న జెడికి వీడ్కోలు..


## కొత్త జెడికి స్వాగతం పలికిన యాదవులు

**పెద్దపల్లి,తెలంగాణ దిశ :**పెద్దపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా పనిచేసిన బి.శంకర్ పదోన్నతిపై ఇటీవల మేడ్చల్ జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో విజయ్ భాస్కర్‌బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన శంకర్ ను, నూత నంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విజయభాస్కర్ ను గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలారపు పర్వతాలు యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాత రాజు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నరసయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ యాదవ్, పెద్దపల్లి మండల అధ్యక్షులు దాడి చంద్రమౌళి యాదవ్, ధర్మారం మండల అధ్యక్షులు, జంగ మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాకు తగ్గిన భారతీయులు..

## 2001 తర్వాత ఇదే తొలిసారి
## ట్రంప్ సర్కారు నిర్ణయాలే కారణం



వాషింగ్టన్ : అమెరికాలో పర్యటించే భారతీయ సందర్శకుల సంఖ్య తగ్గింది. ఏటా జూన్‌లో అమెరికాకు భారతీయ సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. నిరుడు జూన్‌లో 2.3 లక్షల మంది వెళ్లగా, ఈ ఏడాది జూన్‌లో 2.1 లక్షల మంది వెళ్లారు. అంటే, 8 శాతం తగ్గుదల నమోదైంది. ఈ స్థాయిలో తగ్గుదల నమోదు కావడం ఈ మిలీనియంలో ఇదే తొలిసారి. నిరుడు జూలైలో కన్నా ఈ ఏడాది జూలైలో 5.5 శాతం తగ్గుదల కనిపించింది. ఈ వివరాలను అమెరికా వాణిజ్య శాఖకు చెందిన నేషనల్ ట్రావెల్ అండ్ టూరిజం ఆఫీస్ వెల్లడించింది. మొత్తం మీద చూసినపుడు, కొన్ని నెలల నుంచి అమెరికాకు ఇతర దేశాల నుంచి వెళ్లే సందర్శకులు తగ్గిపోతున్నారు. నిరుడు జూన్‌తో పోల్చుకుంటే, ఈ ఏడాది జూన్‌లో 6.2 శాతం తగ్గిపోయారు. నిరుడు మే నెలలో కన్నా ఈ ఏడాది మే నెలలో 7 శాతం మంది, నిరుడు మార్చితో పోల్చినపుడు ఈ ఏడాది మార్చిలో 8 శాతం మంది, నిరుడు ఫిబ్రవరిలో కన్నా ఈ ఏడాది ఫిబ్రవరిలో 1.9 శాతం మంది అమెరికాకు విదేశీ పర్యాటకులు తగ్గిపోయారు. నిరుడు జనవరితో పోల్చినపుడు ఈ ఏడాది జనవరిలో 4.7 శాతం పెరుగుదల కనిపించింది. నిరుడు ఏప్రిల్‌లో కన్నా ఈ ఏప్రిల్‌లో 1.3 శాతం మంది పెరిగారు.

అమెరికన్ వీసా మరింత భారం: భారత దేశం నుంచి అమెరికాకు వెళ్లే ప్రయాణికులు అక్టోబరు 1 నుంచి వీసా ఇంటెగ్రిటీ రుసుముగా 250 డాలర్లు (సుమారు రూ.22,000)ను చెల్లించవలసి ఉంటుంది. దీంతో మొత్తం వీసా ధర 442 డాలర్లు (సుమారు రూ.38,974) అవుతుంది. ఈ అదనపు భారాన్ని మెక్సికో, అర్జంటైనా, భారత్, బ్రెజిల్, చైనా వంటి నాన్ వీసా వెయివర్ దేశాల నుంచి వెళ్లే ప్రయాణికులు భరించవలసి ఉంటుంది.

హెచ్-1బీ, ఎఫ్-1 వీసాలకు వ్యక్తిగత ఇంటర్వ్యూలు తప్పనిసరి: ఇంటర్వ్యూ వెయివర్ లిస్ట్‌ను అమెరికా సవరించింది. దీంతో నాన్ ఇమిగ్రెంట్స్ సెప్టెంబరు నుంచి తప్పనిసరిగా వ్యక్తిగతంగా ఇమిగ్రేషన్ ఇంటర్వ్యూలకు హాజరుకావలసి ఉంటుంది.

వయసు పద్నాలుగేళ్ల లోపు, 79 ఏళ్లు పైబడిన దరఖాస్తుదారుల్లో అత్యధికులు ఇకపైన వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరుకావలసిందే. వీరికి ఇప్పటి వరకు మినహాయింపు ఉండేది. అయితే, వీసా వెయివర్ లిస్ట్‌లో ఉన్నవారు వ్యక్తిగత ఇంటర్వ్యూకు హాజరుకానవసరం లేదు. కొన్ని రకాల బీ1/బీ2 వీసాహోల్డర్స్ మాత్రమే ఇంటర్వ్యూ వెయివర్ బెనిఫిట్‌కు అర్హులు.

# ఆస్ట్రేలియాలో భారత వ్యతిరేక నిరసనలు!



## వందేండ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కంటే ఐదేండ్లలో వచ్చిన భారతీయులే ఎక్కువని ఆరోపణ
## ప్రతిగా శరణార్థుల రక్షణ సంఘం ర్యాలీ

కాన్‌బెర్రా : ఆస్ట్రేలియాలో వలసదారులకు వ్యతిరేకంగా, ముఖ్యంగా భారతీయులకు వ్యతిరేకంగా ఆదివారం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా' పేరుతో నిర్వహించిన ఆందోళనలో నిరసనకారులు ప్రధానంగా భారతీయులను లక్ష్యంగా చేసుకున్నారు. దేశ సాంస్కృతిక నిర్మాణానికి వారు ముప్పుగా మారారని ఆరోపించారు. పెద్దయెత్తున ఉన్న వలసవాదులకు వ్యతిరేకంగా దేశ రాజధాని సిడ్నీ సహా ప్రధాన నగరాలు, పట్టణాలలో ఆందోళన నిర్వహించారు. 5 నుంచి 8 వేల మంది ఆస్ట్రేలియా జాతీయ జెండాలు ధరించి సిడ్నీలో జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. 100 ఏండ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కంటే, ఐదేండ్లలో వచ్చిన భారతీయుల సంఖ్య ఎక్కువగా ఉందని వారు ఆరోపించారు. ఆ ర్యాలీ లక్ష్యం గురించి ఆందోళనకారుల గ్రూప్ వెబ్‌సైట్‌లో వివరించింది. ప్రధాన స్రవంతి రాజకీయ నాయకులు ఎప్పటికీ చేయలేనిది సాధించడం, సామూహిక వలసలను అంతం చేయాలని డిమాండ్ చేయడం తమ ర్యాలీ లక్ష్యం అని నిరసన బృందం శనివారం ఎక్స్‌లో పేర్కొంది. కాగా, నిరసనకారుల ఆందోళనకు ప్రతిగా శరణార్థుల హక్కుల రక్షణ సంఘం పేరుతో కొందరు ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా తీవ్రవాద ఎజెండాను వారు తీవ్రంగా నిరసించారు. వారి చర్య అసహ్యం, కోపాన్ని కలిగిస్తున్నదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఈ నిరసన ప్రదర్శనలను తాము వ్యతిరేకిస్తున్నట్టు కార్మిక శాఖ మంత్రి ముర్రే వాట్ తెలిపారు. వీటిని నియో-నాజీ సంస్థలు నిర్వహించిన, ప్రోత్సహించిన ఉద్యమమని ఆయన వ్యాఖ్యానించారు. విద్వేషాన్ని వ్యాప్తి చేసే, సమాజాన్ని విభజించే ఇలాంటి ఆందోళనలను తాము ప్రోత్సహించబోమని స్పష్టం చేశారు.

# తలనొప్పిగా మారిన యూరియ..?!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు యూరియా చుట్టూ తిరుగుతున్నాయి. యూరియా సరైన స్థాయిలో సరఫరా కాకపోవడంతో తెలంగాణ రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్రం డిమాండ్ కు తగ్గట్టుగా యూరియా సప్లై చేయకపోవడంతో రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. వాస్తవానికి యూరియా సరఫరా చేయడం లేదని బిజెపి పార్లమెంట్ సభ్యుడు చెప్పినప్పటికీ.. గులాబీ పార్టీ మీడియా రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తోంది. తన అనుకూల సోషల్ మీడియా గ్రూపుల ద్వారా ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఇవేవీ తెలియని రైతులు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం అని చెప్పుకుంటున్నారు.స్థానిక ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో యూరియా కొరతను సాకుగా మార్చుకొని.. ఎన్నికల్లో లబ్ధి పొందాలని భారత రాష్ట్ర సమితి చూస్తోంది. ఇదే అదునుగా ఎరువు కష్టాలకు కారణం రేవంత్ ప్రభుత్వం అని ప్రాజెక్ట్ చేస్తోంది. దానికి తగ్గట్టుగానే కొంతమంది రైతులతో నెగిటివ్ కామెంట్స్ చేయించి సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేయిస్తున్నది.. దురదృష్టవషత్తు ఇలాంటి ప్రచారానికి అడ్డుకట్ట వేసి.. గట్టి కౌంటర్లు ఇవ్వాల్సిన అధికార పార్టీ సోషల్ మీడియా నిశ్శబ్దంగా ఉండిపోయింది. భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాన్ని ఎండ కట్టడంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విఫలం అవుతూనే ఉంది. ఆ పార్టీ సోషల్ మీడియా ఎప్పటికీ మేల్కొంటుంది.. ఎప్పుడు గట్టి కౌంటర్లు ఇస్తుందో అంతు పట్టకుండా ఉంది.స్థానిక ఎన్నికల ముందు రైతులు పడుతున్న యూరియా కష్టాలు అధికార పార్టీకి ప్రతిబంధకంగా మారుతాయి అని విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే రైతులకు యూరియా సప్లై చేసింది ఎవరనేది తెలియదు. పైగా తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు పెరిగిపోయిన నేపథ్యంలో యూరియా కు విపరీతమైన డిమాండ్ ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి కేంద్రం కావలసిన స్థాయిలో యూరియా సప్లై చేయడం లేదని అధికార పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే కేవలం తెలంగాణలో మాత్రమే కాదని.. దేశ వ్యాప్తంగా యూరియా కొరత ఉందని బిజెపి నాయకులు అంటున్నారు.

అంతర్జాతీయంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల యూరియా కొరత నెలకొందని.. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని బిజెపి నాయకులు అంటున్నారు.. అయితే రైతులు మాత్రం

యూరియా కోసం ఎదురుచూసి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం కేంద్రం మీద ఒత్తిడి తీసుకొచ్చి.. కావలసిన ఎరువులను తెలంగాణకు తీసుకొస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బంది ఉండదు. ఒకవేళ ఇదే తీరు కొనసాగిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిభంధకం తప్పదు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే కంటే ముందు రేవంత్ ఈ సమస్యను పరిష్కరిస్తే సరిపోతుంది

# బురద రాజకీయం షురూ?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా క్లౌడ్ బరస్ట్ జరిగింది. మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాలు బాగా ఎఫెక్ట్ అయ్యాయి. అయితే నేతలు వరదలోనూ రాజకీయాలను వెతుక్కుం టున్నారు. ప్రభుత్వ వైఫల్యమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలు రాజకీయ పరమైనవేనని చెప్పాలి. ఎందుకంటే ప్రకృతి వైపరీత్యాలను ఎవరూ అడ్డుకోలేరు. అందులోనూ జలప్రళయాన్ని ఎవరూ ఆపలేరు. అధికారంలో కాంగ్రెస్ ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ ఉన్నప్పటికీ సహాయక చర్యలు చేపట్టాలంటే అందుకు అనువైన పరిస్థితులుండాలి. రాజకీయ నేతలు ఎవరూ సహాయక చర్యల్లో పాల్గొనరు. వాళ్లు కేవలం ఆదేశాలు జారీ చేయడం మాత్రమే.. కానీ వరదల్లో చిక్కుకుపోయిన వారిని సురక్షితమైన ప్రాంతాలకు చేర్చేది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది మాత్రమేనని గుర్తుంచుకోవాలి. కానీ అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండానే మెరుపు వరదలు వెళ్లిపోయాయి. అయితే భారీగా పంట నష్టం జరిగింది.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంఒడిశా వద్ద తీరం దాటడంతో కొంత ఊపిరిపీల్చుకున్నట్లయింది. జాతీయ రహదారులే కొట్టుకుపోయాయి. రైల్వే ట్రాక్ కూడా దెబ్బతినింది. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయాలు మానుకుని బాధితులకు అవసరమైన మేరకు సాయం అందించాల్సిన పరిస్థితుల్లో పార్టీ నేతల రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు ఏవగింపును కలిగిస్తున్నాయంటున్నారు. .. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ గోదావరి ఉప్పొంగి భద్రాచలం నీటమునిగింది. మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కూడా చాలా ఆస్తి నష్టం, పంట నష్టం జరిగింది. నాడు కూడా రాజకీయ నేతలు, మంత్రులు, ముఖ్యమంత్రులు వరద తగ్గిన తర్వాత మాత్రమే ఆ ప్రాంతాల్లో పర్యటించగలిగారు. వారికి భరోసా ఇవ్వగలిగారు. ఇప్పుడైనా జరిగిన పంట నష్టం అంచనా వేసిన తర్వాత రైతులందరికీ సాయం చేయాలని, నష్ట పరిహారం అందించాలని విపక్షాలు కోరడంలో తప్పులేదు. అంతేకాని భారీ వర్షం కురుస్తున్న సమయంలోనే ప్రభుత్వ వైఫల్యం అంటూ ఎక్స్ లో పోస్టులు పెట్టడం ఎంత వరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికార, విపక్ష పార్టీలు వరదలపై రాజకీయ విమర్శలు మానుకుని బాధితులకు తక్షణ సాయం అందించడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

# ఆర్ జి 3 లో 88 శాతం బొగ్గు ఉత్పత్తి

## ఆర్.జి-3 జి.యం సుధాకర్ రావు



**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** సింగరేణి సంస్థ ఆర్‌జి త్రీ పరిధిలో 88%బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జి ఎం సుధాకర్ రావు తెలిపారు.ఆగస్టు నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.వారు మాట్లాడుతూ ఆగస్టు నెలలో రామగుండం-3 ఏరియాకు నిర్దేశించిన 4.40 లక్షల టన్నుల లక్ష్యానికి గాను,3.87 లక్షల టన్నులు అనగా 88 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు, నిర్దేశించిన 9.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి) వెలికితీత లక్ష్యానికి గాను, 17.90 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 188 శాతం ఓ.బి (మట్టి) వెలికి తీయడం జరిగిందని, అదేవిధంగా 5.23 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనులవారిగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ ఆగస్టు నెలలోఓ.సి.పి-1 గనికి నిర్దేశించిన 2.40 లక్షల టన్నుల లక్ష్యానికి గాను,1.66 లక్షల టన్నులు అనగా 69శాతం, ఓ.సి.పి-2 గనికి నిర్దేశించిన 2.00 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2.21 లక్షల టన్నులు అనగా 111 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. భవిషత్తులో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు. ఉద్యోగులందరూ బాధ్యతాయు తంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించడానికి కృషి చేయాలన్నారు. వర్షకాలానికి అను గుణంగా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.

# అగాధంలోకి రూపాయి

## డాలర్‌తో 61 పైసలు పతనం
## 88.19 ఆల్‌టైం కనిష్ట స్థాయికి చేరిక



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి వెలవెలపోతోంది. ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ 88 స్థాయిని దాటింది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధుల బయటకు తరలిపోవడం, నెలాఖరు కావడంతో దిగుమతిదారులు డాలర్ల కొనుగోళ్లకు మొగ్గు చూపడం తదితర పరిణామాలు రూపాయి విలువను అగథంలోకి పడేశాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 61 పైసలు పతనమై 88.19కి దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 87.73 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.33 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంతక్రితం ఫిబ్రవరి 10న ఇంట్రాడేలో 87.95 వద్ద నమోదయ్యింది. ఆగస్టు 5న 87.88 కనిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం పెరగనుంది. అంతిమంగా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరగనుంది. "అమెరికా విధించిన భారీ సుంకాలు భారత వాణిజ్య లోటును పెంచుతాయని ఆందోళన కలిగిస్తున్నాయి. దెబ్బతిన్న దేశీయ మార్కెట్లు, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి." అని మిరే అసెట్ షేర్‌ఖాన్‌లోని కరెన్సీ అండ్ కమాడిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనుజ్ చౌధరి పేర్కొన్నారు.

# 'ట్రంప్' భారాలతో ఆక్వా కుదేలు



## - ఎకరాకు రూ.40 వేల వరకూ నష్టం

**అమలాపురం,తెలంగాణ దిశ :**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేసిన ఎగుమతి సుంకాలతో ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం పడింది. గతంలో మూడు శాతం ఉన్న సుంకం ఉండేది. ఆగస్టు ఒకటి నుంచి 25 శాతం, ఆగస్టు 27 నుంచి 50 శాతం పెరిగింది. దీంతో, వ్యాపారులు ధర తగ్గించేయడంతో ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రస్తుతం తగ్గిన ధరల నేపథ్యంలో ఎకరాకు రూ.40 వేల వరకూ నష్టపోయారు. 50 శాతం సుంకం అమలులోకి వచ్చాక నాలుగు రోజుల్లోనే 30 కౌంట్‌పై రూ.60, వంద కౌంట్‌పై రూ.50 ధర పడిపోయింది. 40, 50, 60, 70, 80,90 కౌంట్లపై రూ.20 ధర తగ్గింది. ధర మరింత తగ్గితే నష్టం తీవ్రంగా నష్టపోతామని ఆక్వా రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అధికారికంగా 60 వేల ఎకరాల్లో, అనధికారికంగా 20 వేల ఎకరాల్లో మొత్తంగా 80 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఆక్వా చెరువులకు అనుసంధానంగా సముద్ర తీర ప్రాంతంలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, హేచరీలు, కోల్డ్ స్టోరీజీలు ఉన్నాయి. వీటన్నింటిపైనా ట్రంపు సుంకాల భారం కనిపిస్తోంది. జిల్లా నుంచి ఎక్కువగా అమెరికా, చైనాలకు రొయ్యల ఎగుమతులు జరుగుతున్నాయి. ఇందులో 60 శాతం వరకూ అమెరికాకే ఎగుమతి అవుతున్నాయి. 30 శాతం చైనాకు, మిగిలిన 10 శాతం ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నట్లు వ్యాపారులు చెప్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఏటా మూడు లక్షల టన్నుల నుంచి నాలుగు లక్షల టన్నుల వరకూ రొయ్యల ఎగుమతి జరుగుతున్నాయి.

సన్న, చిన్నకారు రైతులకు రూ.2 లక్షల వరకూ నష్టం: ట్రంప్ సుంకాల పేరుతో వ్యాపారులు రొయ్యల ధరలను (అన్ని రకాల కౌంట్‌లకు సంబంధించి) రూ.30 నుంచి రూ.60 తగ్గించేశారు. దీనివల్ల రైతులకు ఎకరాకు రూ.40 వేల వరకూ నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో కనిష్టంగా మూడు ఎకరాల నుంచి ఆక్వా సాగు చేస్తున్నారు. ఐదెకరాలలోపు పండించే రైతులు, కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. పెరిగిన ఎగుమతి సుంకాల నేపథ్యంలో ప్రస్తుతం వీరు రూ.1.20 లక్షల నుంచి రూ.2 లక్షల వరకూ నష్టపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము ఆక్వా సాగు చేయలేమని వారు చెబుతున్నారు. అమెరికాకు ప్రధానంగా 30 కౌంటు రొయ్యలను మాత్రమే ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ఎగుమతికి పనికి రాని వంద కౌంట్ రొయ్య ధర కూడా వ్యాపారులు తగ్గించేశారని రైతులు వాపోతున్నారు. నెల క్రితం వంద కౌంట్ కేజీ ధర రూ.260 ఉండగా, ప్రస్తుతం రూ.200కే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఎకరాలో రొయ్యల సాగుకు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ ఖర్చు అవుతోందని, ప్రసుత్త పరిస్థితుల్లో చేతికి రూ.5 లక్షలు రావడం కూడా గగనంగానే ఉందని వాపోతున్నారు.

# జగన్ ఆన్ ఫైర్.. వయా ఎంప్లాయిస్



**నెల్లూరు,తెలంగాణ దిశ :** ఏపీలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరుబాట పట్టనున్నాయా? కూటమి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించనున్నాయా? అందుకు తగ్గ గ్రౌండ్ వర్క్ సిద్ధమవుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే కొన్ని ఉద్యోగ సంఘాల నేతలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు కూటమి ప్రభుత్వంపై. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన ఉద్యోగ సంఘాల నేతలు తెరపైకి వస్తున్నారు. జిల్లాల పర్యటన చేస్తున్నారు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ సంఘాలకు మద్దతుగా ట్వీట్ చేశారు.కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులను రోడ్డున పడేసిందని.. వారి బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులతో కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేసే ప్రయత్నం జరుగుతోందన్న అనుమానాలు పెరుగుతున్నాయి. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమికి ప్రధాన కారణం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు. నవరత్నాలకు ప్రాధాన్యం ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులను చాలా తేలికగా తీసుకున్నారు. చివరకు వారి జీతాల చెల్లింపులో కూడా ఇబ్బందులు తెచ్చిపెట్టారు. ఒకటో తేదీన అందాల్సిన జీతాన్ని ఎప్పుడో నెల మధ్యలో ఇచ్చేవారు. వారికి సంబంధించిన రాయితీలను నిలిపివేశారు. అన్ని రకాల చెల్లింపులను జాప్యం చేశారు. ఉద్యోగుల్లో ఆగ్రహం వ్యక్తం అయింది. రోడ్లపైకి వచ్చి నిరసన చేసే పరిస్థితికి వచ్చింది. ప్రభుత్వం నుంచి కవ్వింపు చర్యలు ఎదురు కావడంతో ఆందోళనలు తీవ్రతరమయ్యాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రత్యర్థులకు మించి.. ఉద్యోగులు శత్రువులుగా మారారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దారుణంగా ఓడించడంలో వారి పాత్ర కీలకం.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి ఎదురైన అంశాలను గుణపాఠాలుగా మార్చుకోవాల్సిన కూటమి ప్రభుత్వం.. ఉద్యోగుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. ముఖ్యంగా పెండింగ్ డీఏ విషయంలో ప్రతి మంత్రి వర్గ సమావేశంలో సానుకూల ప్రకటన వస్తుందని ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయులు ఎదురుచూస్తూ వచ్చారు. కానీ నిరాశ ఎదురవుతూ వచ్చింది. అయితే పెండింగ్ డీఏలు విడుదల చేస్తారని భావించారు. కానీ అలా జరగలేదు. ఈనెల మంత్రి వర్గ సమావేశం జరగనుంది. కానుకగా రాయితీలతో పాటు చెల్లింపులు చేస్తారని ఇప్పుడు ప్రచారం ప్రారంభం అయిం ది.అయితే ఒకవైపు ఉద్యోగుల డీఏలకు సంబంధించి ప్రభుత్వ ప్రకటన ఉంటుందని పెదఎత్తున వార్తలు వస్తుండగా.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుకూల ఉద్యోగ సంఘం నేత ఒకరు సంచలన ఆరోపణలు చేశారు.

వైసిపి ప్రభుత్వం పై ఉద్యోగులు విరక్తి చెంది మూడేళ్ల తర్వాతబయటకు వచ్చారని.. కానీ కూటమి ప్రభుత్వ చర్యల పుణ్యమా అని ఇప్పుడే రోడ్లపైకి వస్తున్నారని వచ్చారు. ఎంత జరుగుతున్నా కూటమికి అనుకూలంగా పనిచేసిన ఉద్యోగుల సంఘ నేతలు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులను దారుణంగా వంచిందని.. తక్షణం వారికి ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. దీంతో ఉద్యోగ సంఘాల కదలికలు అనుసరించి తెర వెనుక ఉద్యమాలకు సన్నద్ధం అవుతున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# లగ్జరీ కార్లతో ఈడీ రైడ్స్..?

# 200 కార్లు ఉన్నట్టు అంచనా..!

ముంబై: అకస్మాత్తుగా ఫిలిం ఇండస్ట్రీ ప్రముఖులపై ఈడీ ఆదిలాకారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ముందుగా మల యాళం సూపర్ స్టార్ మమ్ముాటీకి సంబంధించి చెన్నై లో ఒక ఆఫీస్ ఉంది. అక్కడ ఈడీ అధికారులు బుధవారం రోజున సోదాలు నిర్వహిస్తున్నారు. అంతే కాదు మమ్ముాటీతో పాటు అతని తనయుడు దుల్కర్ సల్మాన్ పై కూడా ఐటీ సోదాలు నిర్వహిస్తున్నారు. రీసెంట్ గానే ఈయన నిర్మాతగా 'లోక' అనే చిత్రం తో భారీ ఇండస్ట్రీ హిట్ ని అందుకున్నాడు. అతి తక్కువ బడ్జెట్ లో తీసిన ఈ చిత్రం, ఫుల్ రన్ లో 300 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టి సంచలనం సృష్టించింది. ఈ విషయం స్వయంగా దుల్కర్ సల్మాన్ నిర్మాణ సంస్థ ప్రకటించడం తో టాక్సులు సరిగా కట్టారా లేదా అని సోదాలు చేయడానికి వచ్చినట్టు చెప్తున్నారు.అంతే కాదు దుల్కర్ సల్మాన్ , పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి హీరోలపై లగ్జరీ కార్లను స్మగ్లింగ్ చేస్తున్నారు అంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ సమాచారం ఈడీ అధికారులకు అందడంతో ఆ కోణంలో కూడా సోదారు నిర్వహించారు. ఇలా 'ఆపరేషన్ సుకుమార్' ప్రేతో దేశం లోని ప్రముఖుల ఇళ్లపై సోదాలు నిర్వహిస్తూ సంచలనం సృష్టిస్తున్నారు ఈడీ అధికారులు. మొత్తం 17 ప్రాంతాల్లో ఏకకాలం లో సోదాలు జరుగుతున్నాయి. సోదాలు నిర్వహించిన తర్వాత విచారణలో ఏమి తెలిసాయి అనే దానిపై ఇంకా ఎలాంటి సమాచారం రాలేదు. త్వరలోనే ఈడీ అధికారులు మన టాలీవుడ్ లో కూడా సోదాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఆపరేషన్ నమ్‌ఖోర్ పేరుతో కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ గతంలో దాదాపు 150?200 లగ్జరీ కార్లను గుర్తించింది. ఆ దాడుల సమయంలో దుల్కర్ సల్మాన్, అమిత్ చక్కలక్కల్ వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత దుల్కర్ సల్మాన్ తన కార్లను విడుదల చేయాలని కోరుతూ కేరళ హైకోర్టును ఆశ్రయించారు. వాహనాల అక్రమ రవాణాకేసును కొన్నాళ్లుగా సీరియస్‌గా తీసుకున్న ఈడీ.. భూటాన్ నుంచి దేశంలోకి ప్రీ ఓన్డ్ లగ్జరీ వాహనాలను విదేశీ మారక లావాదేవీలతో కొనుగోలు చేస్తున్నారని కనిపెట్టింది. దాంతో ఫెమా కూడా




ఎంటరైంది.దక్షిణాదిలో ప్రేక్షకాదరణ పొందిన స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ లగ్జరీ కారు అక్రమ రవాణా కేసులో చిక్కుకోవడం సినీ పరిశ్రమలో తీవ్ర కలకలం రేపుతోంది. కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాల్లో దుల్కర్ సల్మాన్ 2004 మోడల్ ల్యాండ్ రోవర్ డిఫెండర్ ఎస్‌యూవీ కూడా ఉంది. ఒక్క కేరళ రాష్ట్రంలోనే అక్రమంగా దిగుమతి చేసుకున్న 150 నుంచి 200దాకా లగ్జరీ కార్లు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కేవలం పన్ను ఎగవేత అంశమే కాదు.. దీని వెనుక మనీలాండరింగ్ కూడా జరిగిందని కస్టమ్స్ అనుమానిస్తోంది. స్వాధీనం చేసుకున్న వాహనాల పత్రాలను కస్టమ్స్ అధికారులు పరిశీలిస్తున్నారు. దుల్కర్ సల్మాన్‌తో సహా వాహన యజమానులం దరికీ సమన్లు జారీ చేసి, వారి స్టేట్మెంట్లు నమోదు చేయబోతున్నారు దర్యాప్తు అధికారులు.ఈ ఏడాది ప్రారంభం లో దిల్ రాజు, మైత్రీ మూవీ మేకర్స్, యూవీ క్రియేషన్స్, గీత ఆర్ట్స్ వంటి సంస్థలపై ఐటీ సోదాలు నిర్వహించారు. అవినీతి చేసినట్టు ఎలాంటి ఆధారాలు లేకపోవడం తో ఐటీ అధికారులు వీళ్లకు క్లీన్ చిట్ ఇచ్చారు. ఇప్పుడు ఇంకా ఎవరిని టార్గెట్ చేయబోతున్నారో చూడాలి.

# రా.. రమ్మంటున్న కెనడా

న్యూఢిల్లీ: మెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా హెచ్-1బీ వీసా నియమాలు ప్రపంచ టెక్ రంగాన్ని కదిలించాయి. దీని ప్రభావం ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులు, విద్యార్థులపై పడుతోంది. మరోవైపు, కెనడా ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకుని, నైపుణ్యవంతులను ఆకర్షించేందుకు కొత్త కార్యక్రమాలు ప్రారంభి స్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 2.0 పాలనలో భాగంగా సెప్టెంబర్ 21న అమలులోకి తెచ్చిన కొత్త ఉత్తర్వుల ప్రకారం, హెచ్-1బీ వీసాకు మొదటి సారి అప్లై చేసేవారు లక్ష డాలర్లు చెల్లించాలి. ఇది యజమానులు, ఉద్యోగులపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతుంది, ముఖ్యంగా చిన్న కంపెనీలు, స్టార్టప్‌లకు ఇది భారమవు తుంది. ఈ నిర్ణయం వల్ల భారత్ నుంచి అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులు, టెక్ ఎక్స్‌పర్ట్‌లు ఆందోళనకు గురవుతున్నారు. గతంలోనే ట్రంప్ టర్మ్‌లో ఇలాంటి ఆంక్షలు ఉద్యోగ అవకాశాలను తగ్గించాయి, ఇప్పుడు ఈ ఫీజు పెంపు మరింత కష్టాలను తెచ్చిపెట్టవచ్చు. దీంతో అమెరికా టెక్ ఇండస్ట్రీలో నైపుణ్య లోటు ఏర్పడే అవకాశం ఉంది.

అయితే ఇది దేశీయ ఉద్యోగాలను రక్షించాలన్న ట్రంప్ లక్ష్యాన్ని సాధించవచ్చు.ట్రంప్ ప్రకటన తర్వాత కొద్ది రోజుల్లోనే కెనడా ప్రధాని మార్క్ కార్నీ హెచ్-1బీ హోల్డర్ల కోసం ప్రత్యేక కార్యక్రమం ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇది అమెరికాలోని టెక్ వర్కర్లను కెనడాకు ఆహ్వానించడమే కాకుండా, వారికి సులభమైన వర్క్ పర్మిట్లు, ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ ఆప్షన్లు అందించడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచుతుంది. కార్నీ, గతంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గా పనిచేసిన ఆర్థికవేత్త. ఈ మార్పులను అమెరికా ఫీజు హైక్‌కు ప్రతిస్పందనగా చూస్తున్నారు. ఇది కెనడా టెక్ హబ్‌లను బలోపేతం చేస్తుంది, ముఖ్యంగా టొరంటో, వాంకూవర్ వంటి నగరాల్లో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహిస్తుంది.ట్రంప్ మొదటి టర్మ్‌లో కెనడా వీసా విజయాలుట్రంప్ మొదటి అధ్యక్ష పదవీకాలంలో ఇలాంటి ఆంక్షలు విధించినప్పుడు, కెనడా 48 గంటల్లోనే 10 వేల మందికి వర్క్ పర్మిట్లు జారీ చేసింది. ఇది టెక్ రంగంలోని అనేకమందిని ఆకర్షించింది. ఇప్పుడు మళ్లీ అదే రకమైన అవకాశం వస్తుందని ఐటీ ఎక్స్‌పర్ట్‌లు ఆశిస్తున్నారు. ఈ గత అనుభవాలు కెనడా ఇమ్మిగ్రేషన్ సిస్టమ్ యొక్క సమర్థతను చూపిస్తాయి, ఇది ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ, టీఈఎం?సంబంధిత డ్రాలు ద్వారా నైపుణ్యవంతులను వేగంగా స్వాగతిస్తుంది. ట్రంప్ నిర్ణయాలు అమెరికా టాలెంట్ పూల్‌ను తగ్గిస్తుండగా, కెనడా దానిని తనకు మళ్లించుకుంటోంది.కెనడాలో స్థిరపడినవారు తర్వాత అమెరికాకు బదిలీ అవుతున్నారు, ఎందుకంటే కెనడా నుంచి యుఎస్ వీసాలు సాధారణంగా సులభంగా లభిస్తాయి. ఇది డ్యూయల్?కంట్రీ స్ట్రాటజీగా మారుతోంది, ముఖ్యంగా ఎన్ఏఎఫ్‌టీఏ లాంటి ఒప్పందాలు (ఇప్పుడు యూఎస్ఎంసీఏ) ద్వారా ఇంట్రా?కంపెనీ ట్రాన్స్‌ఫర్లు సాధ్యమవుతాయి. ట్రంప్ ఆంక్షలు కెనడాను మధ్యవర్తిగా మారుస్తున్నాయి. దీర్ఘకాలికంగా అమెరికా టెక్ ఇండస్ట్రీకి నష్టం కలిగించవచ్చు. భారతీయ నిపుణులు ఈ మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా రిస్క్‌లను తగ్గించుకోవచ్చు, కెనడా ఆర్థిక వ్యవస్థ కూడా లాభపడుతుంది.ఆదిత్యకుమార్ సోమ వంటి నిపుణుల సూచనలు సోషల్ మీడియాలో ఐటీ ప్రొఫెషనల్స్ కెనడా ఆప్షన్లపై దృష్టి పెట్టమని సూచిస్తున్నారు. కెనడాలో ఉంటున్న ఆదిత్యకుమార్ సోమ, ఇన్నోవేటర్ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా, ఇమ్మిగ్రేషన్ కన్సల్టెంట్లతో లైవ్ సెషన్లు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ఇలాంటి సలహాలు ఆందోళనలో ఉన్నవారికి మార్గదర్శనం అందిస్తాయి. సోషల్ ప్లాట్‌ఫామ్‌లు ఈ చర్చలను వేగవంతం చేస్తున్నాయి.మొత్తంగా ట్రంప్ పొమ్మంటే.. మార్క్ కార్నీ మాత్రం రెడ్ కార్పెట్ వేస్తామని ప్రకటించారు. దీంతో కెనడా ఎప్పుడైనా వీసాలు జారీ చేసే అవకాశం ఉంది. దీంతో అటువైపు ఓ కన్నేసి ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పైసా పుట్టటలేదా?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఏ రోటి కాడ ఆ పాట.. ఆ సామెతను ఇప్పుడు రాజకీయ నాయకులు నిజం చేసి చూపిస్తున్నారు. సోషల్ మీడియా బలంగా ఉన్నప్పటికీ.. మీడియా అత్యంత అప్డేట్ గా ఉన్నప్పటికీ రాజకీయ నాయకులు నాలుక మడత పెడుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్నచోట ఒక విధంగా.. అనుకూలంగా లేని చోట మరొక విధంగా మాట్లాడుతున్నారు. ఈ జాబితాలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ముందు వరుసలో ఉంటారు. ఎందుకంటే ఆయన రాజకీయ ప్రస్థానం టిడిపి నుంచి మొదలైంది. టిడిపిలో ఆయన పార్లమెంట్ సభ్యుడిగా గెలిచిన తర్వాత.. రాజకీయ ప్రయోజనాల కోసం భారత రాష్ట్ర సమితిలో చేరారు. ఆ తర్వాత ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకొని గెలిచారు. మంత్రి కూడా అయ్యారుతన మాట తీరు వల్ల ఆయన సోషల్ మీడియా స్టార్ అయిపోయారు. స్థిరాస్తి వ్యాపారి,

విద్యా వ్యాపారి కావడంతో సహజంగానే ఆయనకు మీడియాలో పాపులారిటీ ఉంటుంది. సోషల్ మీడియాలో కూడా మల్లారెడ్డి నిత్యం కనిపిస్తూ ఉంటారు. అందువల్ల ఆయన ఏం మాట్లాడినా సరే మీడియా విశేషమైన ప్రాచుర్యం కల్పిస్తుంది. సోషల్ మీడియా కూడా విపరీతమైన పబ్లిసిటీ కల్పిస్తుంది. అందువల్లే మల్లారెడ్డి తనకు తాను గొప్ప వ్యక్తిగా చెప్పుకుంటారు. పాలమ్మి, పూలమ్మి, కష్టపడి పైకొచ్చిన వ్యక్తిగా అభివర్ణించుకుంటారు. ఏదైనా దర్యాప్తు సంస్థలు తన మీదికి వస్తే మాత్రం సెంటిమెంట్ కార్డు ముందు పెడతారు.ఇటీవల మల్లారెడ్డి ఏపీలో పర్యటించారు. తిరుమల వెంకన్న స్వామి సేవలో తరించారు. ఆ సమయంలో అక్కడ విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏపీ ముఖ్యమంత్రి గురించి గొప్పగా చెప్పారు. తెలంగాణలో ఐటీ అభివృద్ధికి చంద్రబాబు బాటలు వేశారని చెప్పుకున్నారు. మల్లారెడ్డి నోటి నుంచి ఆ మాటలు రావడంతో గులాబీ శ్రేణులు ఒక్కసారిగా ఆశ్చర్యపోయాయి. ఆ తర్వాత తెలంగాణకు వచ్చిన ఆయన ఒక్కసారిగా తన మాటను మార్చారు. రేవంత్ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణలో రూపాయి కూడా పుడుతలేదని తన ఆవేదనని వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయిందని.. ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని.. యువత గుండెలో కేటీఆర్ ఉన్నారని.. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నారని పేర్కొన్నారు. అసలే మల్లారెడ్డి.. ఆపై రాజకీయాల గురించి సంచలన వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో.. ఆయన మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం మీడియాలో, సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది. మల్లారెడ్డి కోరుకున్నది కూడా ఇదే కాబట్టి..

విపరీతమైన ప్రచారం లభిస్తోంది.మల్లారెడ్డి అలా అన్నాడని కాదు కానీ.. తెలంగాణలో నిజంగానే రియల్ ఎస్టేట్ రంగం పడిపోయింది. కేసీఆర్ హయాంలో ఏ మూలన అయినా 30 నుంచి 40 లక్షలు ఉన్నా ఎకరం ఇప్పుడు 20 లక్షలు అన్నా ఎవరూ కొనడం లేదు. అసలు క్రయవిక్రయాలు పడిపోయాయి. దీంతో నిర్మాణ రంగం, దానికి అనుబంధ రంగాల్లో పైసా పుట్టని పరిస్థితి నెలకొంది. రేవంత్ సర్కార్ వచ్చాక చాలా రంగాలకు డబ్బుల కొరత వెంటాడుతోంది. మార్కెట్లోనూ డబ్బుల చెలామణీ బాగా తగ్గింది. తెలంగాణలో ప్రస్తుత పరిస్థితి చూస్తే మల్లారెడ్డి అన్నట్టుగా 'తెలంగాణలో రూపాయి పుడతలేదు..' అని మల్లారెడ్డి చెప్పింది నిజం..

# పెరుగుతున్న నేరాలు




జాతీయ నేర గణాంకాల నివేదికను 2023 సంవత్సరానికి గాను భారత ప్రభుత్వం విడుదల చేసింది. ఈ గణాంకాలు వివిధ నేరాల పెరుగుదలను సూచిస్తున్నాయి. అందులో ముఖ్యంగా గిరిజనులపై జరిగిన నేరాల్లో, అంతకు ముందు ఏడాది కన్నా, 28 శాతం పెరుగుదల కనబడడం తీవ్ర ఆందోళన కరం. మణిపూర్ మొదటి స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రెండో స్థానం పొందినా ఈ తరహా నేరాలు మిగతా రాష్ట్రాల్లో కూడా గణనీయంగానే నమోదై నాయి. పిల్లల పట్ల జరిగిన వాటిలో తొమ్మిది శాతం పెరుగుదల, మహిళల పట్ల కూడా పెరుగుదలనే చూపిస్తున్నాయి. సైబర్ నేరాలైతే మరింత దూకుడుగా ఉన్నాయి. సాధారణంగా జరిగిన నేరాలన్నీ నమోదు కావు. పోలీస్ స్టేషన్ దృష్టికి రానివి, నమోదు కానివి అధికంగానే ఉంటాయి. అధికారిక లెక్కలు పరిస్థితిని పైపైన చూపిస్తాయి. అంటే అసలు సమస్య ఇంకా తీవ్రంగానే ఉంటుంది. కఠిన చట్టాలు మాత్రమే సమస్యకుపరిష్కారం చూపలేవు. అమలు చేసే యంత్రాంగం సమర్థత, చురుకుదనం, జవాబుదారీతనం పెంచేలా పరిస్థితులు కల్పించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. కేసు నమోదు, దర్యాప్తు మొదలుకొని విచారణ, అంతిమ తీర్పులు శీఘ్రంగా జరగాలి. నేర నియంత్రణ, అదుపులకు ఇతర దేశాలు అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతుల్ని, ఆధునిక సాంకేతికతను అధ్యయనం చేసి దేశంలో అమలు పరచాలి.

# కీలకంగా బీహార్ ఎన్నికలు




ఉత్తరాది రాష్ట్రాల్లో బీహార్ మొదటి నుండి రాజకీయంగా అత్యంత చురుకుగా ఉండే రాష్ట్రంగా గుర్తింపు పొందింది. అక్కడ చోటుచేసుకునే పరిణామాలు అనేక సందర్భాలలో దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయి. దేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేశాయి. ఈ నేపథ్యంలోనే అక్కడ జరగనున్న ఎన్నికలు ఆ రాష్ట్రానికే కాకుండా దేశానికే కీలకంగా మారాయి. బీహార్‌లో అధికారంలో కొనసాగడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి ఎన్నో అడ్డదారులు తొక్కుతోంది. హడావిడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)తో ఎన్నికల కమిషన్ స్వతంత్రత ప్రశ్నార్థకంగా మారింది. పెద్దఎత్తున ఓట్ చోరీ ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటికి జవాబు ఇచ్చి, సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల కమిషన్ (ఇసి) గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షాలపై దాడికి దిగుతోంది. ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న నిరసనల మధ్యే తుది జాబితాను, ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం 243 మంది సభ్యులుగల బీహార్ శాసనసభకు నవంబర్ 6, 11 తేదీలలో పోలింగ్ జరగనుంది. 14వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. మరోవైపు ఇసి విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాపై కూడా దుమారం రేగుతోంది. ఈ జాబితాలోని చేర్పులు, తొలగింపులకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందచేయడంతో పాటు, వాటిని క్షేత్రస్థాయి వరకు ప్రదర్శించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల కమిషన్‌ను మంగళవారం ఆదేశించింది. తుది జాబితాలో తొలగింపునకు గురైన వారి అప్పీల్ హక్కుతో పాటు, ముసాయిదా జాబితాతో పోలిస్తే కొత్తగా ఓటు హక్కు పొందిన లక్షలాది మంది గుర్తింపునకు సంబంధించి కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం ఎన్నో ప్రశ్నలు వేసింది. ఓటర్ల జాబితాను పారదర్శకంగా ఉంచాలని ఇసికి సూచించింది.

తుది జాబితా ప్రకారం 7.42 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అధికారిక లెక్కల ప్రకారమే బీహార్‌లో వయోజన జనాభా ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 8.22 కోట్లు! దీనిని పరిగణలోకి తీసుకుంటే బీహార్ జనాభాలో పది శాతం మంది ఓటు హక్కు కోల్పోయారు. దేశ ఎన్నికల చరిత్రలోనే ఒక రాష్ట్రంలో ఇంతమంది ఓటుహక్కు కోల్పోవడం ఒక రికార్డు! అంతేకాదు, ముసాయిదా జాబితాలో ఓటు హక్కు కోల్పోయిన వారిలో 25 శాతం, తుది జాబితాలో ఓటు హక్కు కోల్పోయిన వారిలో 34 శాతం మంది ముస్లింలే! మొత్తం మీద ఆరు లక్షల మంది ముస్లింలు ఓటర్ల జాబితా నుండి తొలగింపునకు గురైనట్లు వార్తలు వస్తున్నాయి. దీని లక్ష్యం ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మహిళల ఓట్లు కూడా పెద్ద సంఖ్యలో గల్లంతైనట్లు చెబుతున్నారు. ముసాయిదాతో పోలిస్తే తుది జాబితాలో కొత్తగా ఓటర్ల జాబితాలో స్థానం పొందిన వాటిలో లక్షల సంఖ్యలో నకిలీ పేర్లు ఉన్నాయన్న అంశం సైతం ఇప్పటికే సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌కు తాజాగా చేసిన ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే, ఇప్పటికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిన ఇసి వాటిని ఏమాత్రం పాటిస్తుందో వేచి చూడాల్సిందే! మరోవైపు ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న నితిష్ కుమార్ ఇప్పటికే 9 సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పదోసారి కూడా ఆ పదవిని ఆయన ఆశిస్తున్నారు. బిజెపి నేతలు ఆ విషయాన్ని తేల్చకుండా రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలకు మాత్రం నితీష్‌ను పూర్తి బాధ్యుడిని చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఓటర్లను మభ్య పెట్టే కుతంత్రాలకు తెరతీస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో ఈ తరహా విన్యాసాలు మరింత జోరందుకోనున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి కేవలం 0.2 శాతం ఓట్ల ఆధికత్యతను మాత్రమే సాధించింది. దీంతో త్వరలో జరగనున్న ఎన్నికలలో ప్రతి ఓటు కీలకంగా మారనుంది. దీనిని దృష్టిలో ఉంచుకునే దళితులు, మైనార్టీల ఓటు హక్కుకు గండికొట్టే ప్రతి ప్రయత్నాన్ని చివరి వరకు అడ్డుకోవాల్సి ఉంది. అదే సమయంలో ప్రతిపక్షాల మధ్య గరిష్ట స్థాయిలో ఐక్యత పెరగాల్సి ఉంది. గత ఎన్నికల్లో చోటు చేసుకున్న తప్పులు మరోసారి జరగకుం డా చూసుకోవడంతో పాటు, ప్రజలకు నమ్మకం ఇయ్యవలసిన బాధ్యత ప్రతిపక్షాలదే! ఈ తరహా కృషి దేశ లౌకిక పునాదిని కాపాడే ప్రజా ఓటుకు దారితీస్తుంది. అదే జరిగితే మరోసారి దేశానికి దిశా నిర్దేశం చేసిన ఘనత బీహార్‌కు దక్కుతుంది.

# పాక్ నయవంచక విధానాలు !



ఆపరేషన్ సిందూర్ ద్వారా చావుదెబ్బతిన్న పాకిస్థాన్...కాల్పుల విరమణ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి, మరింత నష్టం జరక్కుండా చూసుకుంది. లేకుంటే భారత్ చేతిలో చావుదెబ్బ తినివుండేది. కానీ ఇప్పుడా విషయం మరచిపోయింది. మళ్లీ యుద్ధ ప్రేలాపనలు పేలుతోంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్భాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాటలే ఇందుకు నిదర్శనం. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయ లేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అయితే వీటిని ఓ హెచ్చరికగా తీసుకుని జాగ్రత్తగా ఉండాల్సిన పాక్ నేతలు తరచూ మాటలు పేలుతూనే ఉన్నారు. ఇదంతా కేవలం అమెరికా అండచూసుకునే అని వేరుగా చెప్పనక్కరలేదు. అమెరికా కూడా గతాన్ని మరచి పాక్‌కు పాలుపోసి పెంచుతోంది. ఎందుకంటే ద్రోహం, వంచనకు మారుపేరు పాకిస్తాన్. ఇన్నాళ్లు కష్టకాలంలో ఆర్థికంగా, సైనికంగా రక్షిస్తూ వస్తున్న డ్రాగన్ కంట్రీ చైనాకు పాకిస్తాన్ నమ్మకద్రోహం చేస్తోంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లు అమెరికా పంచన చేరి, చైనా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారు. రెండుదేశాల మధ్య పాకిస్తాన్ డేంజరస్ గేమ్ ఆడుతోంది. ఇటీవల, పాకిస్తాన్ ట్రంప్‌తో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగు తోంది. ముఖ్యంగా, ఇరు దేశాల మధ్య ఖనిజ ఒప్పందం కుదిరింది. దీంతో బలూచిస్తాన్ ప్రాంతంలోని రేర్ ఎర్త్ మినరల్స్,రాగి వంటి లోహాలను అమెరికా కొల్లగొట్టడానికి చూస్తోంది. దీనికి పాకిస్తాన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా సహకరిస్తోంది. నిజానికి ఇంతకాలం చైనాతో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది. ఆపరేషన్ సిందూర్ లో కూడా చైనా సాయం తీసుకుంది. అమెరికా దగ్గరకు పిలిచి ముద్దు చేయడంతో ఇప్పుడు చైనాకు చెక్ పెట్టి అమెరికా పంచన చేరింది. అమెరికా, పాకిస్తాన్ స్నేహం భారత్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికా మద్దతుతో పాక్ బలుపు మాటలు మాట్లాడుతోంది. ఇక పస్నీ ద్వారా భారత వ్యూహాత్మక ఓడరేవు చాబహార్‌ని కౌంటర్ చేయవచ్చు. అమెరికా స్నేహం పాకిస్తాన్‌కు మిలిటరీ, ఇంటెలిజెన్స్ వంటి వ్యూహాత్మక సహకారాన్ని అందించవచ్చు. ఈ చర్యల ద్వారా పాకిస్తాన్తన రక్షణ ఒప్పందాలను మెరుగు పరుచుకోవచ్చు. పాకిస్తాన్ భౌగోళిక రాజకీయ విశ్వాసాన్ని పెంచుతుంది. భారత్‌తో పోలిస్తే తన స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ చర్యలు ఇరాన్‌కు కూడా ప్రమాదకరమే. ఇరాన్ షిప్పింగ్ లైన్లపై అమెరికా నిఘా పెరుగుతుంది. అమెరికా, పాక్ బంధంపై భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ట్రంప్ ఇప్పుడు భారత్‌ను ఇబ్బంది పెట్టే ఏ చర్యను కూడా వదలడం లేదు. నిజానికి పాకిస్తాన్ ద్వారా అరేబియా సముద్రానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని 60 బిలియన్ డాలర్లతో చైనా చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రారంభించింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ పోర్టును నిర్మించింది. అయితే, ఇప్పుడు ఈ గ్వాదర్ పోర్టుకు కేవలం 70 మైళ్ల దూరంలో అమెరికాతో కలిసి పస్నీ ఓడరేవును నిర్మించేందుకు పాకిస్తాన్ సిద్ధమైంది. ఇది భారత్ ఇరాన్‌లో నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు కేవలం 178 మైళ్ల దూరంలోనే ఉంది. చైనా, భారత్, ఇరాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలకు కీలమైన ఈ వ్యూహాత్మక స్థానాన్ని పాకిస్తాన్ అమెరికాకు స్థానం కల్పిస్తోంది. ఈ ఓడరేవు అరేబియా, హిందూ మహాసముద్రంలోని సముద్ర భద్రతకు కూడా చిక్కులు కల్పిస్తుంది. ఈ పస్నీ ఓడరేవు ద్వారా బలూచిస్తాన్‌లోని ఖనిజ సంపదను అమెరికాకు తరలించవచ్చని పాకిస్తాన్ భావిస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనిపై రెండు దేశాలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒక వేళ కార్యరూపం దాల్చితే, చైనాతో పాటు భారత్ ప్రయోజనాలకు కూడా తీవ్ర భంగం కలిగించవచ్చు. దీని నిర్మాణానికి 1.2 బిలియన్ డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఓడరేవు బ్యాటరీ టెక్నాలజీ, క్షిపణుల తయారీ, అధునాతన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో ఉపయోగించే రాగి, యాంటిమోనీ, నియోడైమియం వంటి ఖనిజాల ఎగుమతులకు గేట్‌వేగా మారుతుంది. సెప్టెంబర్ 8న పాకిస్తాన్ మిలిటరీ ఇంజనీరింగ్ కార్ప్స్‌తో 500 మిలియన్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. పాకిస్తాన్ ఈ ఖనిజాల షిప్‌మెంట్‌ను మిస్సోరీకి చెందిన జా స్ట్రాటజిక్ మెటల్స్‌కి ఎగుమతి చేసింది. అమెరికాను మచ్చిక చేసుకుని భారత్‌పై పగతీర్చుకోవడానికి పాక్ వెనకాడకపోవచ్చు. ఆ దేశ రక్షణమంత్రి, ఆర్మీ చీఫ్‌లు అడపాదడపా చేస్తున్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిందే.



## మహిళలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ దిశ :** మానసిక ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకొని మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై మహిళలకు ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నం చందర్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ.. మహిళలు మానసిక ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇటీవలి కాలంలో మహిళలు కుటుంబం, ఉద్యోగం, సామాజిక బాధ్యతలు, వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం సాధించడంలో అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ ఒత్తిడి ఫలితంగా ఆందోళన, నిరాశ, నిద్రలేమి, కోపం, శారీరక అనారోగ్యాలు ఏర్పడుతున్నాయని అన్నారు.

మహిళలు తమ కుటుంబ అవసరాలనే కాకుండా, తమ వ్యక్తిగత మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా సంరక్షించు కోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఒక సంతోషకరమైన తల్లి, భార్య, ఉద్యోగిని కావాలంటే, ముందు మనసు ప్రశాంతంగా ఉండాలని అన్నారు. మానసిక ఆరోగ్యం కోసం మహిళలు ప్రతిరోజూ స్వీయ సంరక్షణ, మంచి అలవాట్లు అవలంబించాలని తెలిపారు. సరైన నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగా, స్నేహితులతో సంభాషణ, అవసరమైతే సైకాలజిస్టు సహాయం పొందడం లాంటివి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ, మహిళలు పాల్గొన్నారు.

# పక్షులకు రక్షణ...

చాలామంది ఇళ్లలో ఇప్పుడు పక్షులు కనిపిస్తున్నాయి. అలవాటుగా కొందరుబీ ఆహ్లాదం కోసం మరికొందరుబీ నమ్మకాలు, విశ్వాసాలను పాటిస్తూ ఇంకొందరు.. వాటిని పెంచుకుంటున్నారు. అందమైన బోనుల్లో ఉంచి.. వాటిని అపురూపంగా చూసుకుంటు న్నారు. అయితే, తెలియకుండా చేసే కొన్ని చిన్నచిన్న పొరపాట్లు.. పక్షులకు ప్రాణాంతకంగా మారుతుంటాయి. అలా అవ్వొద్దంటే.. కింది సూచనలు పాటించాలి.కొందరు పక్షులకు ప్రేమగా.. చాక్లెట్లు, చిప్స్, స్నాక్స్ తినిపిస్తుంటారు. అవి వాటికి ఏమాత్రం సురక్షితం కాదు. శుభ్రమైన తాజా పండ్లు, విత్తనాలు మాత్రమే అందించాలి. పక్షుల దగ్గర ఘాటైన క్లీనింగ్ స్ప్రేలు, ఎయిర్ ఫ్రెష్‌నర్లను, బాడీ స్ప్రేలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపయోగించవద్దు. పిట్టల ఊపిరితిత్తులు చాలా సున్నితంగా ఉంటాయి. బాగా అలవాటైన తర్వాత పక్షులను ఇంట్లో ఫ్రీగా వదిలేస్తారు. అలాంటప్పుడు వాటికి ఇంట్లోని కొన్ని వస్తువులతో హాని కలిగే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా.. సీలింగ్ ఫ్యాన్లు తిరుగుతున్నప్పుడు పక్షులను బోను నుంచి బయటికి తీయకపోవడమే మంచిది. కొన్నిరకాల పెంపుడు పక్షులు



బొమ్మలతో ఆడుకుంటాయి. అలాంటి బొమ్మలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. పెయింట్ వేయని చెక్క బొమ్మలైతే మంచిది. చిన్నచిన్న భాగాలుగా విడిపోయే ప్లాస్టిక్ బొమ్మలు.. ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి. పక్షులు వాటిని ఆహారంగా పొరబడి మింగే అవకాశం ఉంటుంది. వంటగది పొగ కూడా పక్షుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కిచెన్‌లో ఉపయోగించే ఆయిల్స్, వెనిగర్, మిరపకాయ వంటి వాసనలను పక్షులు అసహ్యించుకుంటాయి.

# పోటీ చేసే అభ్యర్థులకు ఈసీ గైడ్ లైన్స్


**నిజామాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. మొత్తం 5 దశల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, 3 దశల్లో సర్పంచ్, వార్డు ఎన్నికలకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాణి కుముది ని షెడ్యూల్ విడుదల చేశారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. త్వరలో ఎన్నికలు జరగనున్నం దున అభ్యర్థుల అర్హతలు, నామినేషన్, డిపాజిట్ నగదు, వ్యయం పరిమితులపై తెలంగాణ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రేషన్ డీలర్లు పోటీ చేయడానికి అవకాశం ఉంది. అయితే నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి 21 ఏళ్లు నిండిన వారిని అర్హులుగా పరిగణిస్తారు. గ్రామ సేవకులు, అంగన్వాడీ కార్యకర్తలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎయిడెడ్ సంస్థలు, స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం పోటీ చేయవచ్చు. పోటీ చేసే గ్రామం, స్థానిక నియోజకవర్గంలో అభ్యర్థి ఓటు హక్కు కలిగి ఉండాలి. మతసంబంధమైన సంస్థల చైర్మన్లతో పాటు సభ్యులకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. సింగరేణి, ఆర్టీసీలో మేనేజింగ్ ఏజెంట్, మేనేజర్ లేదా సెక్రటరీ హోదాలో పనిచేసే వారు మినహా ఇతర ఉద్యోగులు పోటీకి అర్హులు. క్రిమినల్ కోర్టులో కొన్ని నేరాలకు శిక్ష పడిన వారు, శిక్ష విధించిన తేదీ నుంచి 5 సంవత్సరాల వరకు ఎన్నికకు అనర్హులవుతారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టం-1955 పరిధిలోకి వచ్చే కేసుల్లో శిక్ష పడినవారు పోటీ చేసేందుకు అనర్హులు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏదైనా పనికి కాంట్రాక్టు చేసుకున్నా లేదా నిర్వహణకు ఒప్పందం చేసుకున్నా (కాంట్రాక్టర్లు) స్థానిక ఎన్నికల్లో అనర్హులు అవుతారు. స్థానిక సంస్థల అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ధారించింది. జడ్పీటీసీ అభ్యర్థి గరిష్ఠంగా రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి గరిష్ఠంగా రూ.1.5 లక్షలు ఖర్చు చేయవచ్చు. ఇక 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి రూ.2.5 లక్షల వరకు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలని ఈసీ పేర్కొంది.

అలాగే 5000 కంటే జనాభా ఎక్కువ ఉన్న పంచాయతీలో వార్డు సభ్యుడు రూ.50 వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే గరిష్ఠంగా రూ.30 వేలు ఖర్చు చేయవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించాలి. దాంతో పాటు ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వాలి. అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు తమ అర్హతలు, క్రిమినల్ చరిత్ర, ఆస్తులతో పాటు అప్పులు, చదువు వివరాలపై సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి. ఒక్క వివరాలు లేకపోయినా నామినేషన్ రిజెక్ట్ అవుతుంద. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.


అభ్యర్థులు ఎంత డిపాజిట్ చేయాలి..: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పోటీచేసే కేటగిరీని బట్టి డిపాజిట్ చేయాలి. జడ్పీటీసీ అభ్యర్థి (జనరల్?) అయితే రూ.5 వేలు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు అయితే రూ. 2,500 డిపాజిట్ చేయాలి.


ఎంపీటీసీ అభ్యర్థులు రూ.2,500 (జనరల్).. ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థులు రూ.1,250.. సర్పంచ్ ?అభ్యర్థి జనరల్ అయితే రూ.2 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1000.. వార్డు సభ్యుడు జనరల్ అయితే రూ.500.. ఎస్సీ,ఎస్టీ, బీసీలు యితే రూ.250 డపాజిట్ చేయాలి. అభ్యర్థులు పంచాయతీల పన్ను బకాయిలతో పాటు కరెంట్ బిల్లులు చెల్లించి రసీదులు తీసుకోవాలి.

# తండాలో మెరిసిన చిత్రకళ









పేదరికం, వెనుకబాటుతనం ఒకేచోట నివసించే తండాలో ఓ బిడ్డకు పుట్టుకతోనే చిత్రకళ అబ్బింది. తన ప్రతిభేంటో తనకే తెలియదు. హైదరాబాద్‌లో ఉన్నత చదువులు చదువుతూ కుంచె పడితే మట్టిలో మాణిక్యం బయటపడింది. ప్రొఫెషన్ కోర్సులు చేసేంత స్తోమత లేదు. తల్లిలేని బిడ్డను తండ్రిలా ఆదరించిన కోచ్ ఆమెను కళా ప్రపంచంలోకి నడిపించాడు. పెండ్లితో ఎంతోమంది కళాకారిణుల ప్రయాణం ఆగిపోతుంది. కానీ, ఆమె కళల విహారం వివాహంతో మరోమలుపు తిరిగింది. పల్లెలోనే ఉంటూ ప్రపంచ నగరాలకు తను గీసిన చిత్రాలను పరిచయం చేస్తున్నది బాధవత్ వెంకటలక్ష్మి. మాది మెదక్ జిల్లా నర్సాపూర్ దగ్గర్లోని జానకంపేట. చిన్నప్పటి నుంచీ ఏదో ఒకటి చేయాలనే తపన ఉండేది. మాది పల్లెటూరు కావడంతో అక్కడ ఏం చేయడానికి ఉండేది కాదు. నాకు తోచినట్టుగా బొమ్మలు గీస్తూ ఉండేదాన్ని. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ చదవడం కోసం హైదరాబాద్ వచ్చాను. కాలేజ్ అయిపోయిన తర్వాత హాస్టల్‌లో ఖాళీగా ఉండకుండా ఏదో ఒకటి నేర్చుకోవాలనుకున్నాను. దగ్గర్లో ఏయే ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయో వెతికాను. మా హాస్టల్‌కి దగ్గర్లోనే ఒక ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ కనిపించింది. చిన్నప్పటి నుంచి కాలక్షేపం కోసం బొమ్మలు గీసే దాన్ని కదా%ొ% ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ చూడగానే అందులో ఏదో ఉత్సాహం కలిగింది. ఇన్‌స్టిట్యూట్ నడిపే ప్రవాత్ సార్‌కి నా డ్రాయింగ్స్ చూపిస్తే.. ఇంప్రెస్ అయిపోయారు. 'ఇంతకాలం ఎక్కడున్నావ్. ఏం చేస్తున్నావ్? బాగా డ్రాయింగ్ వేస్తున్నావ్. వెంటనే చేరండి' అన్నారు.

తండ్రిలాంటి సార్..: వారంలో మూడు రోజులు సాయంత్రం ఆర్ట్ క్లాసులు ఉండేవి. పెన్సిల్‌తో డ్రాయింగ్స్ గీసేదాన్ని. సార్ షేడింగ్స్ ఇవ్వడం నేర్పించారు. చాలా తొందరగా నేర్చుకున్నాను. నేను గీసిన బొమ్మలు చూసి.. 'ఇంత బాగా వేస్తున్నావ్. నువ్వే నా ఇన్‌స్టిట్యూట్ నడిపేలా ఉన్నావ్!' అని సార్ ప్రోత్సాహించారు. 'నీకున్న టాలెంట్‌కి ఈ ఫీల్డులోకి ముందే వచ్చుంటే మంచి ఆర్టిస్ట్‌గా పేరొచ్చేది. నీ లైఫ్ సెటిల్ అయ్యేది' అని నాలో స్ఫూర్తిని నింపారు. నా ఆర్ట్‌ని మెచ్చుకునేందుకు మా అమ్మానాన్నలతో మాట్లాడాలని ప్రవాత్ సార్ అనుకున్నారు. ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ అడిగారు. 'మా నాన్న మేస్త్రీ పని చేసేవాడు. నాకు చాలా చిన్న వయసు ఉన్నప్పుడే చనిపోయాడు. మా అమ్మకు ఆరోగ్యం బాగుండదు. మేము ముగ్గరం అక్కచెల్లెళ్లం. మా నాయనమ్మే నన్ను చదివిస్తున్నది' అని చెప్పాను. అప్పుడు సార్ 'నువ్వు నేర్చుకోవాలనుకున్నంత కాలం నేర్చుకో. ఫీజు అడగను.

నువ్వు ఓ స్టేజ్‌కి వచ్చిన తర్వాత లక్ష కాదు రెండు లక్షలు ఇచ్చినా తీసుకుంటాను. అప్పటి వరకు ఫ్రీ' అని చెప్పారు. అన్నట్టే ఆయన ఫీజు తీసుకోలేదు. ఆర్ట్ టీచర్‌గా: ఎమ్మెస్సీ, ఆర్ట్ కోచింగ్.. రెండిటినీ మేనేజ్‌చేయలేకపో యాను. ఇంట్రస్ట్ ఉన్నా సీరియస్‌గా నేర్చుకోలేదు. ఎమ్మెస్సీ అయిపోయింది. ఇంతలో కరోనా వచ్చింది. ఇంటికే పరిమితమ య్యాను. సార్ చెప్పిన టిప్స్, ఇచ్చిన నాలెడ్జ్ తోటి బొమ్మలు గీయడం ప్రాక్టీస్ చేస్తూ వచ్చాను. అప్పుడప్పుడూ సార్‌కి కాల్ చేసేది. ఆయన చెప్పిన ట్రిక్స్ ఫాలో అయ్యేది. ఆయన అన్ని రకాల పెయింటింగ్స్ నేర్పించారు. స్కెచ్, షేడింగ్స్, పోర్ట్రెయిట్, అక్రిలిక్స్, ఆయిల్ కలర్, వాటర్ కలర్ పెయింటింగ్స్ గీయడం నేర్పించారు. ఒక కంపెనీ ఆన్‌లైన్‌లో ఆర్ట్ ట్రైనింగ్‌కి సెలెక్ట్ అయ్యాను. అందులో ఏ గ్రేడ్ సాధించాను. తర్వాత వాళ్లే నన్ను టీచర్‌గా తీసుకున్నారు. రెండేళ్లు ఆన్‌లైన్‌లో ఆర్ట్ పాఠాలు చెప్పాను. ఆర్ట్ కమ్యూనిటీ అర్బన్ స్కెచెస్‌లో చేరాను. వాళ్లతో కలిసి అర్బన్ స్కెచ్‌లు గీశాను.

ఒకడుగు వెనక్కి..: అయిదేండ్ల కిందట నాకు పెండ్లయింది. ఆ తర్వాత పిల్లలు. ఇంట్లో పనులకే సమయం సరిపోతున్నది. మళ్లీ ఉద్యోగంలో చేరలేదు. ఫైన్ ఆర్ట్స్ చదవాలని రెండేళ్ల కిందట తెలుగు విశ్వవిద్యాలయం ఎంట్రన్స్ రాశాను. నాలుగో ర్యాంక్ వచ్చింది. జేఎన్ఏఎఫ్‌యూ ఎంట్రన్స్‌లో అరవై నాలుగో ర్యాంక్ వచ్చింది. పిల్లల బాధ్యత కారణంగా వెనకడుగు వేశాను. అయినా మా ఆయన సపోర్ట్‌తో ఆర్టిస్ట్‌గా ముందుకు వెళ్తున్నాను. నర్సాపూర్ దగ్గర ఒక స్కూల్లో ఆర్ట్ టీచర్‌గా చేరాను. పిల్లలు కాస్త పెద్దవాళ్లు అయ్యాక నేను మిస్ చేసుకున్న ఫైన్ ఆర్ట్స్ కోర్స్ చదువుతాను.

రెండడుగులు ముందుకు..: ఆర్ట్ నేర్చుకునే రోజుల్లో.. నా ఫ్రెండ్‌కి పెండ్లి కుదిరింది. ఆమెకు పోర్ట్రెయిట్ గీసి, గిఫ్ట్ ఇచ్చాను. అప్పుడే నేను బొమ్మలు గీస్తానని నలుగురికీ తెలిసింది. నేను టీచర్‌గా పనిచేస్తున్న స్కూల్లో.. ఓ టీచర్ నాతో వాళ్లన్నయ్య బొమ్మ గీయించుకుంది. ఆ సంతోషాన్ని తన వాట్సాప్ స్టేటస్‌లో పంచుకుంది. దానివల్ల మరికొంతమందికి నా గురించి తెలిసింది. అప్పటి నుంచి ఆర్డర్లు వస్తూనే ఉన్నాయి. ఆర్డర్ ఇచ్చినవాళ్ల ద్వారా నలుగురికి తెలియడం, మరికొన్ని ఆర్డర్లు రావడంతో నాకు చేతినిండా పని ఉంటున్నది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు వస్తున్నాయి. ఏ పెయింటింగ్ వేయమంటే అది వేస్తాను.

పోర్ట్రెయిట్స్, చేర్యాల పెయింటింగ్స్, దేవతలు, ల్యాండ్‌స్కేప్స్ వేస్తాను. ఏమీడియం ఆర్డర్ చేస్తే మీడియం వేసి ఇస్తున్నాను. నాకు దేవుడిచ్చిన టాలెంట్ ఇది. నలుగురికి చూపించాలి. చిత్రకళ నాకు దొరికిన నేస్తం.అలాగే యూట్యూబ్ చానెల్ ద్వారా ఆర్ట్ పాఠాలూ చెబుతున్నాను. నన్ను చదివించిన నాయనమ్మకు సదా రుణపడి ఉంటాను. ఈ కళలో మంచి స్థాయికి చేరుకోవాలన్న కల అయితే ఉంది! అందుకోసం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాను.

## అయోధ్య తరహాలో మార్కండేయ దేవాలయ పునర్నిర్మాణం కోసం నిధి సమర్పణ

**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ దిశ :** సిరిసిల్ల మార్కండేయ వీధిలో అత్యంత పురాతనమైన విశిష్టమైన శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయము పునర్నిర్మాణంకై శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి ఒక కార్యచరణను ప్రారంభించిందని శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి కన్వీనర్ మోర శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత రెండు నెలల నుండే పద్మశాలి కుల బంధు వులతో,హిందు బంధువులతో సమాజంలోని అందరిని కలుపుకుని పోయే విధంగా దేవాలయాల ఆధారంగా 22 సమావేశాలను శాంతి నగర్ 'నుండి భూపతినగర్' వరకు, చంద్రంపేట నుండి సాయినగర్ వరకు నిర్వహించి అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. దేవాలయ పునర్నిర్మాణం హిందూ సంఘటనా శక్తికి, ఆత్మ గౌరవానికి, సమరసతకు చిహ్నంగా శ్రీ లలితా పరమేశ్వరీ లక్ష్మీనారాయణ సహిత శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మా ణములో సామాన్యుడి నుండి సం పన్నుడి వరకు అందరినీ భాగస్వామ్యం చేయాలని భావించి అందుకు నిధిసమర్పణ కార్యాచరణను ప్రారంభించి అందరి అభిప్రాయా లను సేకరించామని తెలిపారు. నిధి సమర్పణ కార్యాచరణను ప్రారంభం చేస్తున్నామని అది కూడా వారం పది రోజులలో ప్రారంభిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము అన్నారు. ఇటీవల అయోధ్య లో భవ్యమైన దివ్యమైన అయోధ్య రామమందిర నిర్మాణముకై జరిపిన నిధి సమర్పణ కార్య విధానమే స్ఫూర్తిగా తీసుకుని సామాన్యుడి నుండి సంపన్నుడి వరకుఅందరం దేవుడి ముందర సమానమేఅనే భావనతో ప్రయత్నం చేసి సిరిసిల్ల లో దివ్యమైన భవ్యమైన శ్రీ మార్కండేయ ఆలయాన్ని పునర్నిర్మాణం చేద్దామని ఇది మనందరి సంఘటితశక్తికి, స్వాభిమానాఆత్మ గౌరవానికి ప్రతీకగాఉంటుందని తెలిపారు.

# సినిమా..

## 'కిల్' రాఘవ.. నాని ది ప్యారడైజ్‌పై సూపర్ హైప్




టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్. ఈ చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఇటీవలే విడుదల చేసిన లుక్ నెట్టింట టాక్ ఆఫ్‌దిటౌన్‌గా నిలుస్తోంది. ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. కిల్ యాక్టర్ రాఘవ ఈ సినిమాలో కనిపించబోతున్నాడు. ది ప్యారడైజ్‌లో భాగం కావడం పట్ల ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నాడు రాఘవ. శ్రీకాంత్ ఓదెల రాఘవతో స్క్రిప్ట్ డిస్కషన్స్‌లో పాల్గొన్నాడని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈసందర్భంగా శ్రీకాంత్ ఓదెల-రాఘవ కలిసి దిగిన ఫొటో ఒకటినెట్టింట ట్రెండింగ్ అవుతోంది.తాజా టాక్ ప్రకారం త్వరలోనే రాఘవ పోర్షన్‌కు సంబంధించిన సన్నివేశాలను షూటేయబోతున్నారట. ది ప్యారడైజ్ పాన్ ఇండియా సినిమా కాదని.. పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ అని అంటున్నాడు రాఘవ. ఈ చిత్రాన్ని 2026 మార్చి26న ప్రధాన భారతీయ భాషలతోపాటు ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు మేకర్స్.

## బిగ్ బాస్ హౌజ్‌లో ప్రేమ జంటల సందడి..!



బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 రొటీన్ గానే కొనసాగుతోంది. కొత్తదనం ఉంటుందేమో అనుకుంటే, మళ్లీ అదే పాత ఫార్ములాలు రంగులు మార్చుకుని ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. షో సెట్టింగ్స్, టాస్కల రూపం మారినా అసలు గుణం మాత్రం దాదాపు యథాతథంగా ఉంది. ఈసారి కూడా ఎప్పటిలానే ప్రేమ జంటలు హౌస్‌ను రంజింపజే స్తున్నాయి. ఈ సీజన్ లో రీతు-పవన్, తనూజ-ఇమ్మాన్యుయేల్ లవ్ ట్రాక్‌లు బాగా హైలైట్ అవుతున్నాయి. ముఖ్యంగా తాజా ఎపిసో డ్‌లో పవన్, రీతు జంట టాస్క్‌లో విజయం సాధించిన సందర్భాల్లో ఒకరినొకరు హగ్గులు చేసుకుంటూ తమ బాండింగ్‌ని మరింతగా ప్రదర్శించారు. వీరి బాండింగ్‌పై ఇతర కంటెస్టెంట్ల నుంచి సెటైర్లు కూడా వస్తున్నాయి. సంజన అయితే "ఛాన్స్ దొరికిందిగా ఇక!" అంటూ ఎద్దేవా చేసింది. మరోవైపు తనూజ మాత్రం ఈసారి పవన్‌పై అలిగింది. టాస్క్‌లో ఓడిపోతున్న ఫ్రస్ట్రేషన్‌ను ఆమె పవన్ పై చూపించింది. అయినా పవన్ కూల్‌గా స్పందిస్తూ తనూజను ఓదార్చే ప్రయత్నం చేశాడు. దీనివల్ల ఈ ట్రయాంగిల్ లవ్ (తనూజ-ఇమ్మా న్యుయేల్-పవన్) హౌస్‌లో మరింత చర్చనీయాంశంగా మారింది. ఇక హౌస్‌లో గొడవలు కూడా తారాస్థాయికి చేరుతున్నాయి. శ్రీజ వరుసగా రాము రాథోడ్, దివ్యలతో గొడవపడుతూ నెగటివిటీ పెంచు కుంటుంది. మిగతా కంటెస్టెంట్లతో విభేదాలు పెరగడంతో ఆమె నడవడిక కూడా హౌస్‌లో కాంట్రవర్సీగా మారింది. ఐదవ వారం ముగియనున్న సమయంలో బిగ్ బాస్ హౌస్‌లోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీలు రానున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే దివ్యా నికితా హౌస్‌లోకి అడుగు పెట్టగా, ఈ వీకెండ్‌లో మరిన్ని వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఉండనున్నట్లు సమాచారం. దీంతోఇంట్లో ఉన్న కంటెస్టెంట్లకుపోటీమరింత కఠినంగా మారనుంది. ఇప్పటికే నాలుగు ఎలిమినేషన్లు పూర్తవ్వగా, ప్రస్తుతం 12 మందికంటెస్టెంట్లు మాత్రమే హౌస్‌లో ఉన్నారు. టాస్క్‌లు, ప్రేమ జంటలు, గొడవలు, సర్ప్రైజ్ ఎంట్రీలుఇలా బిగ్ బాస్ షో రసవత్తరంగా సాగుతూనే ప్రేక్షకులను బాగా ఎంగేజ్ చేస్తోంది. ఎవరు ఈ ప్రేమ ఆటల మధ్యలో గేమ్‌లో నిలబడతారు? అనేది ఆసక్తికరంగా మారింది.

## కమిటీ కుర్రోళ్లు కాంబో మళ్లీ రిపీట్..




గత ఏడాది చిన్న సినిమాగా విడుదలై అంచనాలు మించి భారీ విజయాన్ని సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా కాంబో మళ్లీ రిపీట్ కానుందన్న వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రేక్షకులతో బాగా కనెక్ట్ అయ్యేలా తెరకెక్కిన ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ యదు వంశీ , నిర్మాత నిహారిక కొణిదెల మళ్లీ కలిసి కొత్త ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుపుతున్నారని సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఈ కొత్త సినిమా 2026 లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశంఉంది. పింక్ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కనుంది. 'కమిటీ కుర్రోళ్లు' విజయం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఇండస్ట్రీలో ఆసక్తి నెలకొంది. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ సినిమాతో 11మంది హీరోలు, 4గురు హీరోయిన్‌లు తెలుగు తెరకు పరిచయం అయ్యారు. రూ.9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.18.5 కోట్లు థియేట్రికల్ వసూళ్లు, రూ.6 కోట్లు నాన్ థియేట్రికల్ బిజినెస్ సాధించిమొత్తం రూ.24.5కోట్లు రాబట్టి సెన్సే షన్ సృష్టించింది. అవార్డుల రేసులో కూడా 'కమిటీ కుర్రోళ్లు' దుమ్ము రేపింది. సైమా 2025లో ఈ చిత్రం ఘన విజయం సాధించింది.

బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్‌గా నిహారిక కొణిదెల, బెస్ట్ డెబ్యూ యాక్టర్‌గా సందీప్ సరోజ్ అవార్డ్ అందుకున్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రకటిం చిన గద్దర్ అవార్డుల్లో కూడా రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను దక్కించుకుంది. జాతీయ సమైక్యత,

మత సామరస్యం, అణగారిన వర్గాల అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డుతో పాటు ఉత్తమ డెబ్యూ డైరెక్టర్ అవార్డు యదు వంశీ దక్కించుకున్నాడు. ఇక ప్రస్తుతం పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2 గా మరో ప్రాజెక్ట్ ఇటీవలే ప్రారంభమైంది. ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో సంగీత్ శోభన్ , నయన్ సారిక జంటగా నటిస్తున్నారు.

## మహేష్ బాబు-రాజమౌళి మూవీ టైటిల్ లీక్!




సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా, భారత దర్శక దిగ్గజం ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ "గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ ఫిల్మ్" ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, అధికారిక అప్డేట్స్ ఏవీ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశగానే ఉన్నారు. అయితే ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ క్రేజీ లీక్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మహేష్ - రాజమౌళి సినిమా టైటిల్‌గా 'వారణాసి' అనే పేరును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఇండియన్ మైథాలజీ, యాత్రల నేపథ్యంలో నిర్మించబోతున్న ఈ సినిమాపేరుగా ఈ టైటిల్ ఒక మంచి ఎంపికగా చర్చకు వస్తోంది. వారణాసి అనే నగరం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. అంతర్జాతీయంగా కూడా ఆధ్యాత్మికతకు చిహ్నంగా గుర్తింపు పొందిన ఈ నగరం పేరు టైటిల్‌గా ఉండటం సినిమాకు ప్రత్యేకమైన పాన్ వరల్డ్ కనెక్షన్‌ని తీసుకువస్తుందని భావిస్తున్నారు. ఇక హాలీవుడ్ లెజెండరీ దర్శకుడు జేమ్స్ కామెరూన్ నవంబర్‌లో భారత్‌కు రానున్నారు. "అవతార్: ద ఫైర్ అండ్ యాష్" ప్రమోషన్‌లో భాగంగా భారత పర్యటనకు వస్తున్న కామెరూన్ చేతుల మీదుగా మహేష్ - రాజమౌళి మూవీ టైటిల్‌ను రివీల్ చేయించాలని జక్కన్న ప్రణాళిక వేస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల ఈ సినిమా హైప్ మరింత పెరగనుంది. ఈ గ్రాండ్ మూవీలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటించనుండగా, పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న ఆర్. మాధవన్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కథను బట్టి ప్రపంచవ్యాప్తంగా షూటింగ్ జరిపేందుకు ప్రణాళికలు వేస్తున్న జక్కన్న, ఈ సినిమాను ఓ విజువల్ ఎక్స్‌పీరియెన్స్‌గా మలచనున్నారు.దుర్గ ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ ఈ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించనుండగా, టెక్నికల్ టీమ్ అంతా ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఉండనుంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి తెరకెక్కించనున్న ఈ చిత్రం ప్రపంచ సినిమా స్థాయిలో పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందనే అంచనాలు ఇప్పటికే ఏర్పడ్డాయి.

## పెళ్లి పీటలు ఎక్కబోతున్న త్రిష..!



టాలీవుడ్, కోలీవుడ్ లో లెజెండరీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న అందాల త్రిష పెళ్లి గురించి మళ్లీ చర్చలు ఊపందుకున్నాయి. తాజాగా కోలీవుడ్ సర్కిల్స్‌లో త్రిష పెళ్లికి సంబంధించిన వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. తల్లిదండ్రులు చూసిన సంబంధానికి ఆమె ఓకే చెప్పిందనే టాక్ నడుస్తుంది. త్రిష గతంలో బిజినెస్ మ్యాన్ వరుణ్ మనియన్‌తో నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ నిశ్చితార్థం పెళ్లివరకు దారి తీస్తుందని అనుకోగా, అనూహ్యంగా అది రద్దయింది. అప్పటి నుంచి త్రిష తన కెరీర్‌పైనే దృష్టి సారించింది. మనసుకు నచ్చినవాడు దొరికితే తప్పక పెళ్లి చేసుకుంటాను అని త్రిష గత కొన్నాళ్లుగా చెబుతూ వస్తుంది. తాజా సమాచారం ప్రకారం, త్రిష తల్లిదండ్రులు చండీఘర్‌కు చెందిన ఓ కుటుంబంతో సంబంధం కుదిర్చినట్లు తెలుస్తోంది. ఆ యువకుడు ఆస్ట్రేలియాలో స్థిరపడి బిజినెస్ చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల తన వ్యాపారాన్ని భారత్‌లో విస్తరించాడని కూడా చెబుతున్నారు. రెండు కుటుంబాలు దగ్గరైన నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని త్రిష కూడా ఈ సంబంధానికి ఓకే చెప్పినట్లు కోలీవుడ్‌లో చర్చ నడుస్తుంది. అయితే ఈ విషయంపై త్రిష నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం త్రిష చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర' లో నటిస్తోంది. అదే సమయంలో తమిళంలో 'కరుప్పు' అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. ఇవే ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ప్రధాన ప్రాజెక్టులు. మునుపటి క్రేజ్ తగ్గిన నేపథ్యంలో ఈ రెండు సినిమాలపై చాలా ఆశలు పెట్టుకుంది త్రిష. ఇక బాలీవుడ్‌లో కూడా త్రిష రీఎంట్రీకు ప్లాన్ చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఒక్క సినిమాతో బాలీవుడ్ ప్రయాణాన్ని ఆపేసిన త్రిష, ఇప్పుడు మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించాలనుకుంటుందట. మరి తాజాగా త్రిష పెళ్లికి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో నిజం ఎంత ఉంది అన్నది తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. కానీ ఈ సారి మాత్రం త్రిష నిజ ంగానే పెళ్లి పందిరిలోకి అడుగుపెడుతుంది అన్న ఆశాభావం అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215